



పంచాయతీలకు.. నిధులు

- ఫలించిన సర్పంచ్‌ల పోరాటం
- ఎట్టకేలకు దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- 1172 పంచాయతీలకు రూ.41.01 కోట్లు
- పంచాయతీ ఖాతాలకు ఆర్థిక సంఘం నిధుల జమ

ఎట్టకేలకు నిధుల కోసం పంచాయతీల ప్రథమ పౌరుల పోరాటం ఫలించింది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. పంచాయతీ ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి నిధుల లేమితో తాము పనులు ఏమీ చేయలేక పోతున్నామంటూ సర్పంచ్‌లు వినూత్న రీతుల్లో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు నిధుల కోసం రోడ్డెక్కారు. ఆర్థిక సంఘం నిధులను వాడుకోవడంపై కేంద్ర ప్రభుత్వానికి కూడా రాష్ట్ర ప్రభుత్వంపై సర్పంచ్‌లు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో గురువారం పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సర్పంచ్‌లు నిధులు సాధించుకున్నారు.



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సర్పంచ్‌ల ఉద్యమం ఫలించింది. ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించడంపై పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు చేసిన పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ నిధుల అక్రమాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లారు. సర్పంచ్‌ల నిధుల ఉద్యమానికి వైసీపీ మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దతు ఇచ్చాయి. చివరకు సర్పంచ్‌లు సంక్రాంతి పండుగ రోజు భిక్షాటన కూడా చేశారు. ఇలా అనేక రూపాల్లో ఉద్యమం తీవ్రం చేయడంతో ప్రభుత్వం తలవంచక తప్పలేదు. ఎట్టకేలకు 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాలకు జమ కావడంతో సర్పంచ్‌లు, సదరు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. కొంత మేర ఆర్థిక ఇక్కట్ల నుంచి పంచాయతీలు గట్టెక్కనున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిలాలకు సంబంధించి రూ.41.05 కోట్లు జమయ్యాయి. పల్నాడు జిల్లాలోని 519 పంచాయతీలకు రూ.17,58,79,659, బాపట్ల జిల్లాలోని 426 పంచాయతీలకు రూ.13,70,09,439 నిధులు విడుదలయ్యాయి. గుంటూరు జిల్లాకు సంబంధించి 227 పంచాయతీలకు రూ.9,72,62,511 జమ చేశారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా నిధులను పంచాయతీలు ఖర్చు చేయాల్సి ఉంది. ఆర్థిక ఇబ్బందులతో కునారిల్లుతున్న పంచాయతీలు ఈ నిధులతో కొంతమేర నిలదొక్కుకునే అవకాశం ఏర్పడింది. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తీర్చే అవకాశం సర్పంచ్‌లకు వచ్చింది.

నాలుగున్నరేళ్లుగా మళ్లింపు

జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తోంది. అయితే నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించేసింది. వాటిని సొంతానికి వాడేసుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కూడా రాష్ట్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. గ్రామ స్వరాజ్యం తీసుకువస్తున్నామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించివేస్తున్నది. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి అధికారాలకు గండి కొట్టిందన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం పీడీ ఖాతాలకు బదిలీ చేసుకుంది. సచివాలయాల నిర్వహణ ఖర్చును కూడా స్థానిక సంస్థలపై వేస్తోంది. నిధుల్లేక పల్లెల్లో కనీసం పారిశుధ్య పనులను నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొంటున్నాయి. నిధులు జమ చేయాలని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో నిధుల కోసం సర్పంచ్‌లు ఉద్యమాలను ఉధృతం చేశారు. సొంత నిధులతో పనులు చేపట్టి అప్పులు పాలైన పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు న్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం స్పందించడంతో పాటు సర్పంచ్‌ల ఉద్యమంతో ఉక్కిరిబిక్కిరి అయిన రాష్ట్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. వెరసి 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీ బ్యాంక్ ఖాతాలకు జమ చేసినట్లుగా ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది.

ఉద్యమాలతో సాధించుకున్నాం



కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు జమ చేసింది. ఉద్యమాల ఫలితంగానే ఈ నిధులు సాధించుకున్నాం. ఈ నిధులను పంచాయతీల్లో అభివృద్ధి పనులకు వినియోగిస్తాం. భవిష్యత్‌లో కూడా పంచాయతీలకు నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలి.

\- డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి

కేంద్రం ఆదేశాలు పట్టించుకోకుండా..

పంచాయతీల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. జలవనరులను పెంపొందించుకునేందుకు చెరువులు, కుంటలు అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలు ఏర్పాటు, తాగునీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, మరుగుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వాహణ తదితర పనులకు ఆర్థిక సంఘం నిధుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. నిధుల వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలోతొక్కింది. అయితే ఇందుకు విరుద్ధంగా నిధులను ప్రభుత్వం దారిమళ్లించి వాడేసుకుంది. 15వ ఆర్థిక సంఘం గత విడత నిధుల్లో దాదాపు రూ.81కోట్లు ఇతరాలకు వినియోగించుకుంది.

జంగాకు షాక్?

- టిక్కెట్ లేదని తేల్చిన అధిష్ఠానం
- మళ్లీ మహేష్‌రెడ్డే పోటీ చేస్తారని వెల్లడి
- ఎమ్మెల్యే పార్థసారథితో కృష్ణమూర్తి భేటీ
- ఎమ్మెల్సీ జంగా నిర్ణయంపై ఊహాగానాలు



ఎమ్మెల్యే పార్థసారథి కార్యాలయంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

నరసరావుపేట, జనవరి 18: ఈ సారి నా ఓటు నేనే వేసుకుంటా.. గురజాల నుంచి పోటీ చేస్తా.. అని ప్రకటించిన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి వైసీపీ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. గురజాల టిక్కెట్‌ను తనకు ఇవ్వాలని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఎంతోకాలంగా అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలో సమావేశాలు కూడా గతంలో ఏర్పాటు చేశారు. అయితే జంగాకు టిక్కెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ సారి కూడా కాసు మహేష్‌రెడ్డే గురజాల నుంచి పోటీ చేస్తారని జంగాకు తేల్చిచెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరనున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పార్థసారథితో పెనమలూరులోని ఆయన కార్యాలయంలో జంగా కృష్ణమూర్తి గురువారం భేటీ అయ్యారు. వీరిద్దరి కలయిక రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే పార్థసారథి టీడీపీలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో జంగా రాజకీయ ప్రయాణంపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే జంగా తన నిర్ణయాన్ని ఇంకా తెలియజేయలేదు.

జంగా తీవ్ర అసంతృప్తి

అధిష్ఠానం మాటలతో జంగా తీవ్ర అసంతృప్తికి లోనయ్యారని తెలిసింది. తనకు పార్టీలో అడుగడుగునా అవమానం జరుగుతోందని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ పదవి ఆశించానని ఆ పదవి కూడా దక్కలేదని, ఈ ఎన్నికల్లో తనకు గురజాల టిక్కెట్ ఇస్తానని జగన్‌మోహనరెడ్డి ఇచ్చిన హామీ కూడా అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తోటవారిపాలెంలో విషాదం

- విద్యుదాఘాతంతో నానమ్మ, మనవరాలు మృతి



మృతిచెందిన నాయనమ్మ, మనవరాలు

చీరాల టౌన్, జనవరి 18: మండల పరిధిలోని తోటవారిపాలెం రెడ్డికాలనీలో గురువారం రాత్రి విద్యుదాఘాతంలో నాయనమ్మ, మనవరాలు అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఇందుకు సంబంధించి వివరాలు.. వ్యవసాయ కూలీ అయిన ఆట్ల మేనకోటమ్మ(70) ఇంట్లో నుంచి బయటకు వస్తూ నేలపై ఉన్న విద్యుత్ మోటార్ వైర్లను తొక్కింది. ఆప్రాంతంలో జాయింట్ ఉండటం, దానిపై టేప్ లేకపోవడంతో విద్యుదాఘాతానికి గురైంది. పెద్దగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న మనుమరాళ్లు శ్రీనివాసులు(22), విజయలక్ష్మి బయటకు వచ్చి నాయనమ్మను కాపాడేందుకు పట్టుకున్నారు. దీంతో ముగ్గురూ విద్యుదాఘాతానికి గురయ్యారు. మేనకోటమ్మ, శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందగా విజయలక్ష్మికి గాయాలయ్యాయి. శ్రీనివాసులు సంక్రాంతి సందర్భంగా అత్తింటి నుంచి పుట్టింటికి రాగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈపూరుపాలెం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నారా లోకేశ్

ఎన్టీఆర్‌తోనే తెలుగుజాతికి గుర్తింపు

- వాడవాడలా ఎన్టీఆర్ వర్ధంతుల్లో టీడీపీ నేతలు
- అన్నదానం, రక్తదానంతో నివాళులు అర్పించిన తమ్ముళ్లు



బాపట్లలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీశ్రేణులతో కలిసి పుష్పాంజలి ఘటిస్తున్న తెలుగుదేశం పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతికి గుర్తింపు, గౌరవం తెచ్చిన మహనీయుడు ఎన్టీ రామారావు అని టీడీపీ నేతలు కొనియాడారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిలబెట్టిన ఎన్టీఆర్, ప్రజల వద్దకే పాలనతో ప్రజలకు చేరువయ్యారని కీర్తించారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ అనేది ఎన్టీఆర్ సిద్ధాంతమని, ఆయన ఆశయసాధనకు నేటి యువత ముందుకురావాలని నేతలు పిలుపిచ్చారు. జిల్లావ్యాప్తంగా గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా కార్యక్రమాలతో తెలుగుతమ్ముళ్లు సందడి చేశారు. సభలు, సమావేశాలతోపాటు పలు చోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించారు. శిబిరాల్లో రక్తదానం చేసినవారికి నాయకులు ధ్రువీకర ణపత్రాలు అందజేశారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన వర్ధంతి కార్యక్రమం జరిగింది. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు తరపున లోకేశ్‌కు సర్టిఫికెట్‌ను అందజేశారు.

ప్రయాణానికి.. పాట్లే



- బస్సులన్నీ బెజవాడ సభకే
- ముఖ్యమంత్రి జగన్ సేవలో ఆర్టీసీ
- డిపోలకు లక్ష్యాలు నిర్దేశించి కేటాయింపు
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 630 బస్సులు
- ఇక్కడవి సరిపడక తిరుపతి, నంద్యాల, నెల్లూరుల నుంచీ

బాపట్ల, జనవరి 18: సంక్రాంతి ముగిసింది.. సెలవులు అయిపోయాయి.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి పండుగ సంబరాల్లో మునిగి తేలి స్వస్థలాకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే ప్రయాణాలకు సిద్ధమైన వారికి ఆర్టీసీ షాక్ ఇచ్చింది. శుక్రవారం విజయవాడ లో జరిగే సీఎం జగన్ సభకు జనసమీకరణకు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచే డిపోల్లో సర్వీసులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జనసమీకణకు బస్సులను వినియోగిస్తుండటంతో శుక్రవారం ప్రయాణికులు ఇక్కట్లు పడనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు జనాన్ని తరలించేందుకు ప్రభుత్వ పెద్దలు అడిగిందే తడవుగా ఆర్టీసీ అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 630 బస్సులు సిద్ధం చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను తరలిస్తున్నారు. పండుగకు సొంతూళ్లకు వెళ్లిన వారు గమ్య స్థానాలకు చేరుకోవడానికి శుక్రవారమంతా బస్సులు ఉండవు. దీంతో బస్సులు లేక ప్రయాణం నరకప్రాయం కానున్నది. గుంటూరు-1, 2, పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి 182 బస్సులను సిద్ధం చేస్తున్నారు. 122 ఇక్కడి బస్సులు కాగా మరో 60 బస్సులు తిరుపతి నుంచి తెప్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలోని ఆరు డిపోల నుంచి 230 బస్సులను తరలిస్తున్నారు. ఇందులో పల్నాడు నుంచి 170 సర్వీసులు కాగా మరో 60 సర్వీసులు నంద్యాల నుంచి తెప్పిస్తున్నారు. బాపట్ల జిల్లాలో 220 బస్సులను సిద్ధం చేయగా ఇందులో నెల్లూరు, కాకినాడ నుంచి కూడా బస్సులు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బాపట్ల జిల్లా పరిధిలోని ఒక్కో నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు 38 బస్సులను కేటాయించారు. వేమూరు నియోజకవర్గం నుంచి 39 బస్సుల్లో జనాన్ని తరలించేందుకు నాయకులు ఏర్పాట్లు చేశారు. పల్నాడు జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి 33 బస్సులను కేటాయించారు. ఆయా బస్సుల ద్వారా ఒక్కో నియోజవర్గం నుంచి 1419 మందిని తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. జన సమీకరణలను ఎమ్మెల్యేలు పర్యవేక్షిస్తున్నారు. వినుకొండ నుంచి డ్వాక్రా మహిళలను విజయవాడకు బస్సుల్లో తరలించే బాధ్యత వెలుగు సిబ్బందికి కేటాయించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే సర్వీసులను గురువారం సాయంత్రానికి ఆయా ప్రాంతాలకు తరలించగా, స్థానిక డిపోల్లో ఉన్న సర్వీసులను శుక్రవారం ఉదయానికి నిర్థీత ప్రాంతాలకు చేరుకునేలా సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కండీషన్‌లో ఉండాలి.. మర్యాదగా వ్యవహరించాలి

విజయవాడ సభకు పంపించే సర్వీసులు మంచి కండీషన్‌లో ఉండాలని ఇప్పటికే గ్యారేజ్ సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా బ్రేక్ డౌన్ కాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సభకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉండాలని ఆర్టీసీ పెద్దలు సిబ్బందికి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పండుగ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసుల లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో అరకొరగా కండీషన్‌లో ఉన్న సర్వీసులను సభకు తరలించగా డొక్కు బస్సులను సామాన్య ప్రయాణికులకు అందుబాటులో ఉంచటం విమర్శలకు తావిస్తోంది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సగానికి పైగా సీఎం సభకు తరలిస్తే సామాన్య ప్రయాణికులు గంటల తరబడి అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. కోసం అధికారులు కూడా నానా హైరానా పడుతున్నారు.

నేడు వాహనాల దారి మళ్లింపు ఇలా..

గుంటూరు: విజయవాడలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా శుక్రవారం విజయవాడ మార్గంలో వాహనాలు దారి మళ్లిస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. విగ్రహావిష్కరణ సభకు వెళ్లే, అత్యవసర వాహనాలకు ఈ మార్గంలో అనుమతి ఉంటుందన్నారు.

బుడంపాడు జంక్షన్: గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు బుడంపాడు జంక్షన్ వద్ద హైవే దిగి తెనాలి, వెల్లటూరు జంక్షన్, అవనిగడ్డ, హనుమాన్ జంక్షన్ మీదగా వెళ్లాలి.

బోయపాలెం జంక్షన్: బాపట్ల వైపు వెళ్లే వాహనాలు బోయపాలెం, ప్రత్తిపాడు మీదగా వెళ్లాలి. గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలు బోయపాలెం వద్ద సర్వీస్ రోడ్డు పక్కన నిలుపుకోవాలి.

హైదరాబాద్ వైపు: గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా వెళ్లాలి. విజయవాడ వైపు అనుమతిలేదు. చిలకలూరిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వారు గుంటూరు చుట్టుగుంట, పేరేచర్ల మీదగా వెళ్లాలి.

మంగళగిరి వైపు: మంగళగిరి నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు రేవేంద్రపాడు జంక్షన్ మీదగా తెనాలి, పెనుమూడి ఫై ఓవర్ మీదగా వెళ్లాలి.

ప్రైవేటు వాహనాలు కూడా..

విజయవాడలో సీఎం జగన్ సభకు పలు ప్రైవేటు వాహనాలను కూడా తరలిస్తున్నారు. పోలీసు, రవాణా అధికారులకు లక్ష్యాలు ఇచ్చి మరీ వాహనాలను ఏర్పాటు చేయిస్తున్నారు. దాచేపల్లిలో పలు ప్రైవేటు స్కూల్స్, కళాశాలల యాజమాన్యానికి రవాణాశాఖ, వైసీపీ నేతలు బస్సులు ఏర్పాటు చేయాలని ఫోన్ చేసి ఆదేశించినట్లు తెలిసింది. విద్యా సంస్థలకు సెలవు ఉన్నందున బస్సులు ఏర్పాటు చేయాలని యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నారు. మాచర్లలో రెండు వార్డులకు ఓ ప్రైవేటు స్కూల్ బస్సును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అధికార పార్టీ నేతల సూచనలు, సలహాలు స్వీకరిస్తూ ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యంతో అధికారులు చర్చలు జరుపుతున్నారు. విజయవాడలో ముఖ్యమంత్రి పాల్గొనే సభకు 200 వాహనాలు సమకూర్చాలని తెనాలి రవాణా శాఖకు టార్గెట్ పెట్టారు. ఒక్కో విద్యా సంస్థ 5 నుంచి 10 వాహనాలు పంపాలని అధికారులు ఆదేశించారు. వాహనాలు పంపకపోతే ఫిట్‌నెస్, లైసెన్స్‌ల రెన్యూవల్, కెపాసిటీ అంశాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనాలు పంపేందుకు యాజమాన్యాలు సిద్ధమైనట్లు సమాచారం.

పంటలపై.. విషం

- రైతులపై బయోల పంజా
- నకిలీలతో కౌలు రైతుల దివాలా
- లేబుల్‌పై అడ్రస్‌లో కంపెనీలు కానరావు

గుంటూరు సిటీ, జనవరి 18: కోబ్రా అనేది భయంకరమైన విషం. అది తాకితే భూమి మీద నూకలు చెల్లుతాయి. ఇప్పుడు అదే పేరుతో చలామణి అవుతున్న బయో పురుగు మందులు కొన్ని పచ్చని పంటలను పాడుచేస్తున్నాయి. తయారీదారులు ఎవరో, ఎక్కడ ఉంటారో సరిగా తెలుసుకోకుండానే కొందరు ట్రేడర్లు వాటిని విక్రయించి కౌలు రైతులను నిలువునా ముంచేస్తున్నారు. కోబ్రా పేరుతో మార్కెట్‌లో ఉన్న బయో మందుకు బలైన రైతులు చివరకు వినియోగదారులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ నకిలీ బయో మందు విరివిగా అమ్మకాలు జరిగినట్లు సమాచారం. కోబ్రా అనేది ఒక ఉదాహరణ మాత్రమే. ఇటువంటి ఊరు.. పేరు లేని బయో మందులు ఎన్నో ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 25 వేల కోట్ల వరకు జరిగే వ్యవసాయ ఆధారిత వ్యాపారంలో పురుగుమందులది అగ్రభాగం. అందులో బయో మందుల పేరిట జరుగుతున్న భారీ మోసానికి అన్నదాతలు నిలువునా బలవుతున్నారు. ఇంత మోసం ప్రత్యేకంగా జరుగుతున్నా ఏ ఒక్క శాఖకు చీమైనా కుట్టినట్లు ఉండకపోవటం విచారకరం. పత్రికలలో వార్తలు వచ్చినప్పుడో.. కలెక్టర్లు మండిపడినపుడో హడావుడి చేస్తున్న వ్యవసాయ శాఖ ఆతర్వాత చేష్టలుడిగి చూస్తున్నదనే విమర్శలున్నాయి. కళ్ల ముందే నకిలీ పురుగు మందులకు రైతులు బలవుతున్నా అధికారులకు పట్టకపోవడం శోచనీయం. బయో మందులను విక్రయిస్తున్న చాలా కంపెనీలు లేబుళ్లపై ముద్రించే అడ్రస్‌కు వెళ్తే అక్కడ ఎవరూ ఉండటం లేదు. గుంటూరు జిల్లాకు వస్తున్న బయో పురుగు మందులు అన్నీ తెలంగాణ రాష్ట్రం నుంచి వస్తున్నాయి. అక్కడ ఆయా జిల్లాల్లో అవి తయారైనట్లు చెబుతున్నా వాస్తవంగా యూనిట్లు అక్కడ ఉండటం లేదు. మార్కెట్‌లో మంచి పేరు కలిగిన బ్రాండ్లను లక్ష్యం చేసుకుని రైతులను బుట్టలో పడేస్తున్నారు. నకిలీ మందులను బ్రాండెడ్ లేబుళ్లతో చలామణి చేస్తున్నారు. తెలంగాణ నుంచి కొన్ని బయో మందులను తీసుకువచ్చి వాటికి లోకల్ బ్రాండ్లను తగిలిస్తున్నారు. ఈ రీతిగా మందులు విక్రయాలు జరిపే వారికి లైసెన్సులు కూడా ఉండటం లేదు. ఎటువంటి శాస్త్రీయ ఫార్ములేషన్ లేకుండా బయో మందులు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు.

నాడు రైతు.. నేడు డ్రైవర్

పల్నాడుకు చెందిన కౌలు రైతు జరుగుల ఆంజనేయులు కంది పంటను సాగుచేశారు. పొలంలో కొట్టేందుకు కోబ్రా పేరుతో ఉన్న బయో మందును కొనుగోలు చేశారు. లీటరు రూ.2400 చొప్పున మొత్తం రూ.లక్షకు మందును కొన్నారు. మందును పంటకు కొట్టిన తర్వాత అది పూర్తిగా పాడవుతున్నట్లు గుర్తించారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించారు. బయో మందు వల్లే పచ్చని పంట పాడైందని భావించి నష్టపరిహారం కోసం వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన న్యాయస్థానం, రైతుకు రూ.9.40లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఆ తర్వాత అసలు కథ మొదలైంది. బయోను విక్రయించిన ట్రేడర్ అసలు ఆ మందును ఎక్కడ తయారుచేశారో.. దాని యాజమాన్యం ఎక్కడ ఉంటుందో తనకు తెలియదని చేతులెత్తేశారు. వ్యాపారుల దగాతో నష్టపోయిన రైతు ప్రస్తుతం డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు.



ఆంజనేయులును నిలువునా ముంచిన కోబ్రా బయో మందు

ధనుష్, నాగార్జున కలయికలో...



విలక్షణ నటుడు ధనుష్, టాలీవుడ్ మన్మథుడు అక్కినేని నాగార్జున కలయికలో ఓ భారీ మల్టీస్టారర్ రూపొందుతోంది. ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. సోనాలీ నారంగ్ సమర్పకులు. గురువారం పూజా కార్యక్రమాలతో లాంచనంగా చిత్రీకరణ ప్రారంభించారు. ధనుష్‌పై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

అన్ని హంగులతో భైరవకోన

సందీప్ కిషన్




ఫిబ్రవరి 9న దెయ్యాలూ, భూతాలూ, మ్యాజిక్కు, మంచి హ్యూమర్, పాటలు, బోలెడంత యాక్షన్ ఉన్న చిత్రాన్ని ప్రేక్షకులు చూడబోతున్నారు. 'ఊరు పేరు భైరవకోన' చిత్రం ఇలా వాణిజ్య హంగులు, చక్కని వినోదంతో ముస్తాబైంది' అని సందీప్ కిషన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వీఐ ఆనంద్ దర్శకత్వం వహించిన చిత్రమిది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించారు. గురువారం చిత్రబృందం ట్రైలర్ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ 'రెండున్నరేళ్ల పాటు బాధ్యతగా ఈ చిత్రం కోసం పని చేశాం. ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తాం. 'నిజమేనే చెబుతున్నా' పాటను ప్రేక్షకులు గొప్పగా ఆదరించారు' అని చెప్పారు. వీఐ ఆనంద్ మాట్లాడుతూ "ఊరు పేరు భైరవకోన' నా కెరీర్‌లో ఛాలెంజింగ్ ప్రాజెక్ట్. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని, ఎక్సయిట్‌మెంట్‌ను ఇస్తుంది' అని తెలిపారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'మంచి ప్రేమకథ, ఫాంటసీ, కామెడీ, యాక్షన్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉన్నాయి' అని తెలిపారు.

వారిద్దరికీ మా కుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది

– నందమూరి మోహనకృష్ణ



ఎన్టీఆర్ మన మధ్య లేకపోయినా ఆయన ఆశీస్సులు ఎప్పుడూ మనతోనే ఉంటాయి. వజ్రాన్ని కూడా సాన పట్టాలి .అలా 'మనదేశం' సినిమాలో నాన్నగారికి అవకాశం ఇచ్చి నటుడిగా మెరుగులు దిద్దిన దర్శకుడు ఎల్వీ ప్రసాద్‌గారికీ, నిర్మాత కృష్ణవేణిగారికి మా కుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది' అన్నారు నందమూరి మోహనకృష్ణ. ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా ఆయన నటించిన తొలి చిత్రం 'మనదేశం' చిత్రం 75 వసంతాల వేడుకలు గురువారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో జరిగాయి. ఎన్టీఆర్ సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ తనయుడు రమేశ్‌ప్రసాద్, ఆ చిత్రాన్ని పంపిణీ చేసిన పూర్ణా పిక్చర్స్ అధినేత విశ్వనాథ్‌లను సత్కరించారు. సెలబ్రేషన్స్ కమిటీ ఛైర్మన్ జనార్ధన్ మాట్లాడుతూ 'నలభై ఏళ్ల తర్వాత దేశానికి ఎలాంటి అవసరాలు ఉంటాయో ఊహించి ముందే చెప్పిన గొప్ప దూరదృష్టి కలిగిన నాయకుడు ఎన్టీఆర్. నటుడిగా ఆయన గొప్పతనం గురించి ప్రపంచ ప్రజలందరికీ తెలుసు' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఆదిశేషగిరిరావు, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, హైదరాబాద్ మింట్ తరఫున శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





మానవ విసర్జక వ్యవస్థ

ఏపీపీఎస్సీ ప్రత్యేకం: బయాలజీ

మూత్రం ఏర్పడే విధానం

మూత్రపిండంలో మూత్రం ఏర్పడే విధానాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. అవి... సూక్ష్మగాలనం, నాళికాయుత పునఃశోషణ, నాళికా స్రావం.

సూక్ష్మగాలనం: మొదటి దశలో రక్త నాళికాగుచ్ఛంలో ఉండే రక్తం వడపోతకు గురై భౌమన్స్ గుళికలోకి చేరుతుంది. ఈ విధానాన్నే సూక్ష్మగాలనం లేదా రక్తనాళికా గుచ్ఛగాలనం అంటారు. అభివాహి ధమనిక కలిగించే పీడనం వలన రక్త కేశ నాళికాగుచ్ఛంలోకి వడపోతకు గురైన రక్తం చేరుతుంది. గుచ్ఛగాలనం ద్వారా ఏర్పడిన ద్రవాన్ని గాలిత ద్రవం లేదా ప్రాథమిక మూత్రం అంటారు. ప్రాథమిక మూత్రంలో వ్యర్థ పదార్థాలు, పోషకపదార్థాలు, నీరు ఉంటాయి. ప్రాథమిక మూత్రం రసాయనికంగా రక్తంతో సమానం. దీనిలో కణాలు ఉండవు. ఆరోగ్యవంతమైన మానవుడిలో నిమిషానికి దాదాపు 125 మి.లీ. ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది.

నాళికాయుత పునఃశోషణ: దీనినే వరణాత్మక పునఃశోషణ అంటారు. ఈ దశ సమీపస్థ సంవళిత నాళికకు, వ్యాసారెక్టాకు మధ్య జరుగుతుంది. సమీపస్థ సంవళిత నాళికకు మరోపేరు పూర్వ సంవళిత నాళిక. వ్యాసారెక్టా అంటే నెఫ్రాన్ నాళిక చుట్టూ విస్తరించి ఉండే వల లాంటి రక్త కేశ నాళికల సమూహం. దీనిని పరినాళికా రక్త కేశ నాళికలు అంటారు. ప్రాథమిక మూత్రం సమీపస్థ సంవళిత నాళాన్ని చేరినప్పుడు 75 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది. ప్రాథమిక మూత్రంలో ఉపయోగ పదార్థాలైన గ్లూకోజ్, అమైనో ఆమ్లాలు, పొటాషియం, కాల్షియం, సోడియం క్లోరైడ్ మొదలైనవి సమీపస్థ సంవళిత నుంచి వ్యాసారెక్టాలోకి శోషింపబడతాయి.

నాళికా స్రావం: ఈ దశ వ్యాసారెక్టాకు, దూరాగ్ర సంవళిత నాళానికి మధ్య జరుగుతుంది. సమీప సంవళిత నాళంలో పునఃశోషణ తరవాత మూత్రం హెన్లీశిక్యం ద్వారా దూరాగ్ర సంవళితనాళంలోకి చేరుతుంది. వ్యాసారెక్టా నుంచి దూరాగ్ర సంవళితనాళంలోకి ప్రవేశించిన పదార్థాలు యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్, సోడియం, పొటాషియం, క్లోరైడ్, హైడ్రోజన్ అయాన్లు మూత్ర గాఢతను, pHను నియంత్రిస్తాయి. ఈ విధంగా అధిక గాఢత గల మూత్రం ఏర్పాటులో హెన్లీశిక్యం, సంగ్రహణ నాళాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. హెన్లీశిక్యం ప్రాంతంలో ఉన్న మూత్రం నుంచి 10 శాతం నీరు ద్రవాభిసరణ ద్వారా దానిని ఆవరించి ఉన్న కణజాలంలోకి శోషింపబడుతుంది. సంగ్రహణ నాళంలో వాసోప్రెస్సిన్ హార్మోన్ సహాయంతో నీటి పునఃశోషణ జరిగి మూత్రం అతి గాఢతను పొందుతుంది. గాఢతలో గరిష్ఠ స్థాయికి చేరిన ఈ ద్రవమే మూత్రం. రక్తం కంటే మూత్రం అధిక గాఢతలో ఉంటుంది.



మూత్ర పిండం మార్పిడి

దీర్ఘకాలికంగా కిడ్నీలు పనిచేయని వారికి మూత్రపిండ మార్పిడి ప్రక్రియను చేపడతారు. 1954లో చార్లెస్ హాఫ్‌నగెల్(అమెరికా) అనే వైద్యుడు మొట్ట మొదట మూత్ర పిండ మార్పిడికి రూపకల్పన చేశాడు. మనదేశంలో 1971 డిసెంబరు 1 వేలూరు(తమిళనాడు)లోని క్రిస్టియన్ మెడికల్ కళాశాలలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు.

మూత్ర సంఘటన

ఆరోగ్యవంతమైన మానవుడు ప్రతి రోజూ 1 నుంచి 1.8 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. దీనితోపాటు 25 నుంచి 30 గ్రాముల యూరియా కూడా విసర్జితమవుతుంది. రక్తంలోని హిమోగ్లోబిన్ విచ్ఛిన్నమైనప్పుడు ఏర్పడే యూరోక్రోమ్ అనే పదార్థం కారణంగా మూత్రం పసుపు రంగులోకి మారుతుంది. యూరియా విచ్ఛిన్నం చెంది అమ్మోనియా ఏర్పడటం వలన మూత్రం మొదట ఆమ్లయుతంగా(pH=6.0) ఉన్నప్పటికీ క్రమంగా క్షారయుతంగా మారుతుంది. మూత్రంలో 96 శాతం నీరు, 2.5 శాతం కర్బన పదార్థాలు(ఆక్సలేట్స్, హార్మోన్స్, యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్ నీటిలో కలిగే విటమిన్స్), 1.5% అకర్బన పదార్థాలు(అయోడిన్, మెగ్నీషియం, క్లోరైడ్, కాల్షియం, సోడియం, ఫాస్ఫేట్, సల్ఫేట్) మొదలైన పదార్థాలు ఉంటాయి. 24 గంటల మూత్ర పరీక్ష అంటే...ఒక వ్యక్తి నుంచి 24 గంటలలో సేకరించిన మొత్తం మూత్రంలో నుంచి 100-15 మి.లీ. మూత్రాన్ని నమూనాగా తీసుకొని పరీక్షిస్తారు. ప్రోటీన్లు అధికంగా తీసుకుంటే మూత్రంలో యూరియా అధికంగా, కార్బోహైడ్రేట్స్ అధికంగా తీసుకుంటే చక్కెరలు ఎక్కువగా ఉంటాయి.

కృత్రిమ మూత్రపిండం

డాక్టర్ విలియం కాఫ్‌ను డయాలసిస్ పితామహుడిగా పిలుస్తారు. మానవుడి మూత్ర పిండాలు పనిచేయని స్థితిలో రక్తాన్ని వడపోయడానికి తోడ్పడే యంత్రమే కృత్రిమ మూత్రపిండం లేదా డయలైజర్. ఈ పద్ధతిని హీమోడయాలసిస్ అంటారు. ఈ ప్రక్రియలో రక్తాన్ని ధమని నుంచి తీసి సిర ద్వారా ఎక్కిస్తారు. దీనికి దాదాపు మూడు నుంచి ఆరు గంటల సమయం పడుతుంది. ఈ ప్రక్రియలోని డయలైజర్ పరికరంలో వడపోతకు అనుకూలంగా ఉండే సెల్లోఫేన్‌తో తయారైన గొట్టాలను వాడుతారు. హెపారిన్, ఆంటిహెపారిన్‌ను ఉపయోగిస్తారు. హెపారిన్ అనేది రక్తంలో యాంటికొయాగ్యులెంట్‌గా పనిచేస్తుంది. ఈ ప్రక్రియ యురేమియా వ్యాధిగ్రస్తులకు ఒక వరం లాంటిది. యూరేమియా అంటే మూత్ర పిండాలు సరిగా పనిచేయని వారి శరీరంలో నీరు, వ్యర్థ పదార్థాలు నిండిపోయే దశ. ఈఎస్ఆర్‌డి(ఎండ్ స్టేజ్ రెనాల్ డిసీజ్) అంటే మూత్ర పిండాలు పనిచేయక పోవడమని అర్థం.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

నిట్ సూరత్‌కల్‌లో ఎంబీఏ

సూరత్‌కల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక (నిట్ కే) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. క్యాట్/మ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 3
- **వెబ్‌సైట్:** www.nitk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..

సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Qg6kumVలో చదవండి.






అధునాతన ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి తదితరులు

ఎయిమ్స్‌లో అధునాతన ల్యాబ్ ప్రారంభం

మంగళగిరిసిటీ, జనవరి 18: మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ క్లినికల్ మైక్రోబయాలజీ విభాగంలో ఇంటిగ్రేటెడ్ స్టివర్డ్ షిప్ పేరిట ఏర్పాటు చేసిన అధునాతన ల్యాబ్‌ను ఎయిమ్స్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ ముఖేష్ త్రిపాఠి గురువారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బెంచ్ టాప్ మ్యాట్రిక్స్ అసిస్టెడ్ లేజర్ డిసార్షన్ ఐయోనైజేషన్-టైమ్ ఆఫ్ ఫ్లైట్ పరికరం ద్వారా క్లినికల్ మైక్రోబయాలజిస్టులు కొద్ది నిమిషాల్లోనే బ్యాక్టీరియా, నిర్దిష్ట శిలీంధ్రాలను గుర్తించేవీలు కలుగుతుందని, రోగనిర్ధారణలో భాగంగా వ్యాధి కారకాలను ముందస్తుగా గుర్తించి కచ్చితమైన యాంటీమైక్రోబయాల్ థెరపీని ప్రారంభించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్ట్రిడ్జ్ ఆధారిత న్యూక్లియిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్టు పరికరం ద్వారా పల్మనరీ, అదనపు పల్మనరీ శాంపిల్స్‌లో టీబీ శాతాన్ని గుర్తించవచ్చని, సార్స్, హ్యూమన్ పాపిలోమా వైరస్, ఆర్ఎస్వీ హెచ్ఐవీ, హెచ్‌బీవీ, హెచ్‌సీవీ తదితర వైరల్ లోడ్లకు సంబంధించి వైరల్ వ్యాధి కారకాలను గుర్తించడం దోహదపడుతుందన్నారు. రక్తపరీక్షల కోసం రూపొందించబడిన కెమిలుమినిసెన్స్ ఇమ్యూనోఅస్సే(క్లియా) పరికరంద్వారా గంటలో గరిష్ఠంగా 200 పరీక్షలను చేయవచ్చన్నారు. ఈపరికరం హెచ్ఐవీ, హెచ్‌బీవీ, హెచ్‌సీవీ, లెప్టోస్పిరోసిస్, వివిధ వ్యాధికారక ఏజెంట్లను గుర్తించి యాంటిజెన్, యాంటీబాడీస్ వంటి వివిధ సెరోలాజికల్ పరీక్షల నిమిత్తం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ క్లినికల్ మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ సుమిత్ రాయ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


మందడం శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

రైతులకు అన్యాయం చేస్తే పుట్టగతులుండవు

- 1493వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు జనవరి 18: రాజధాని అమరావతి నిర్మాణం కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేస్తే వైసీపీ ప్రభుత్వంలో అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1493వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు మాట్లాడుతూ.. అమరావతే రాష్ట్ర రాజధానిగా ఉంటుందని, బ్రహ్మాండంగా కడతామని ఎన్నికల ముందు చెప్పన సీఎం జగన్‌రెడ్డి మాట తప్పాడన్నారు. అధికారంలోకి వచ్చి మూడు రాజధానులంటూ రైతులను మోసం చేశాడన్నారు. ఐదు కోట్ల మంది కోరుకునే అమరావతిని కాదనటం పెద్ద తప్పిదమన్నారు. మూడు ముక్కల ఆటకు ఎప్పుడైతే తెర తీశారో అప్పుడే రాష్ట్రం పతనం ప్రారంభమైందన్నారు. రాష్ట్ర నడి బొడ్డులో రూపుదిద్దుకుంటున్న అమరావతి రాజధానిని నిర్వీర్యం చేయటంతో మొత్తం ప్రగతి ఆగిపోయిందన్నారు. లక్షల కోట్ల రాష్ట్ర సంపదను ఆవిరి చేయాలనుకోవటం సీఎం జగన్‌రెడ్డి అవివేకమన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అమరావతిని అభివృద్ధిని కొనసాగించమని తీర్పు చెప్పినా లెక్క లేకుండా పాలకులు ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ సాయంత్రం వేళ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

ముదిమిలోనూ..

మమకారం!

- జీఎంసీలో 1964 బ్యాచ్ సమ్మేళనం
- 60 ఏళ్ల నాటి అనుబంధం..
- రూ.2 కోట్ల విరాళం ప్రకటించిన గోపాలరావు


గుంటూరు వైద్య కళాశాల 1964వ బ్యాచ్ విద్యార్థులు

గుంటూరు(మెడికల్),జనవరి18: వారిది అరవై ఏళ్ల అనుబంధం.. వారంతా గుంటూరు వైద్య కళాశాల 1964లో బ్యాచ్ పూర్వ విద్యార్థులు. వైద్య వృత్తి పూర్తిచేసి దేశ, విదేశాల్లో డాక్టర్లుగా స్థిరపడ్డారు. ప్రస్తుతం ముదిమిలోకి ప్రవేశించినా.. మాతృ విద్యాసంస్థ గుంటూరు మెడికల్‌కాలేజీపై ప్రేమ, అభిమానం అణువంతైనా తగ్గలేదు. సరిగ్గా అరవై ఏళ్లకు.. గురువారం వారంతా వైద్యకళాశాలలో మరోసారి కలుసుకున్నారు. పాత మిత్రులనుచూసి భావోద్వేగానికి గురయ్యారు. 'ఎంత కాలమైందిరా నిన్ను చూసి.. ఎలా ఉన్నావ్..' అంటూ ఆప్యాయంగా ఒకరినొకరు హత్తుకున్నారు. పూర్వవిద్యార్థులు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ తదితరులు రెండేళ్ల పాటు పాత మిత్రులను సంప్రదించి, తమ వైద్యవిద్య షష్టిపూర్తి సందర్భంగా మరోసారి జీఎంసీలో కలిసేందుకు కృషి చేశారు. ఆకృషి ఫలితమే గురువారంనాటి 1964వబ్యాచ్ సమ్మేళనం.

రూ.2 కోట్ల విరాళం....

యలమంచిలి శివాజీ, రాయపాటి శ్రీనివాస్‌తో పాటు నాటి బ్యాచ్‌కు చెందిన ఉస్మానియా మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ కృష్ణంరాజు, శ్రీలంక నుంచి వచ్చిన ఉషా గుణవర్ధిణే, అమెరికా నుంచి వచ్చిన నిర్మల, బుచ్చిబాబు, వీవీ రమేష్‌బాబు, జనార్ధనరెడ్డి, అంజిరాజు, దండమూరి బాబు రాజేంద్రప్రసాద్, బీవీ సత్యనారాయణ, బేబీ జానకి, మణి తదితరులు ఈ వేడుకలకు హాజరయ్యారు. నాటి బ్యాచ్‌లో 150 మంది విద్యార్థులు ఉండగా, ఈ వేడుకలకు 40 మంది హాజరయ్యారు. కొందరు కాలధర్మం చెందారు. వారి జ్ఞాపకాలను వీరు నెమరువేసుకున్నారు. జీఎంసీ ప్రిన్సిపాల్ టీటీకే రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌ను కలసి తమ బ్యాచ్ తరఫున ఏదైనా విరాళం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ వేడుకలకు హాజరు కాలేకపోయిన నాటి విద్యార్థి డాక్టర్ గోపాలరావు (హైదరాబాద్) తమ మాతృ విద్యాసంస్థకు రూ.2 కోట్ల విరాళం అందజేస్తానని సమాచారం పంపారు. కాగా పూర్వ విద్యార్థులు శుక్ర, శనివారాల్లో చీరాలలోని బీచ్‌లో సరదగా గడిపేందుకు వెడుతున్నారు.


జీజీహెచ్‌లోని నాట్కో కేన్సర్ సెంటర్‌ను తిలకిస్తున్న పూర్వ విద్యార్థులు

తండ్రి ఆచూకీపై ఆందోళన

- కుటుంబ సభ్యుల నిరసన


తిరుపతయ్య(ఫైల్)

అమృతలూరు, జనవరి18: తన తండ్రి ఆచూకీ తెలియకపో వడంతో ఆ కుటుంబ సభ్యులు ఆందోళన బాట పట్టారు. వివరాల్లోకి వెళ్లితే మండల పరిధిలోని ఇంటూరు గ్రామానికి చెందిన బొలిమేర తిరుపతయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తిరుపతయ్య గత ఏడాది అక్టోబరు నెల నుంచి కనబడటం లేదు. చిన్న కుమారుడు రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది అక్టోబరు 3న గ్రామంలో చర్చి ప్రతిష్టా కార్యక్రమంలో తిరుపతయ్య పాల్గొన్నాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన నటరాజ్ అనే వ్యక్తిని కలిసేందుకు వెళ్లాడు. అప్పటి నుంచి తన తండ్రి ఆచూకీ తెలియడంలేదని తెలిపారు. రోజులు గడుస్తున్నా తిరిగి రాకపోవడంతో గత ఏడాది డిసెంబరు నెలలో పోలీసులకు తెలిపారు. కాగా


తండ్రి అదృశ్యంపై విచారణ కోరుతున్న కుమారుడు రాజు

తన తండ్రిని గ్రామానికి చెందిన నటరాజ్ అనే వ్యక్తి హత్య చేసి మృతదేహాంను మాయం చేసినట్లుగా కుమారులు అనుమానిస్తున్నారు. నటరాజ్ అనే వ్యక్తికి గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుల సహకారం ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని పోలీసులకు తెలిపారు. ఈ నేపథ్యంలో తన తండ్రిని హత్య చేసిన వ్యక్తితో పాటు, అతనికి సహకారం అందించిన వారిని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ పార్కు వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న నాటుసారా తయారీ పరికరాలతో పోలీసు అధికారులు

25 లీటర్ల సారా స్వాధీనం

- 2,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- స్టూవర్టుపురం ప్రాంతాల్లో పోలీసుల కార్డెన్ సర్చ్

బాపట్ల, జనవరి 18: మండలంలోని వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం 50 మంది పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్టూవర్టుపురంలోని పెదగ్యాంగ్, చినబేతపూడి, వృక్షనగర్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. 25లీటర్ల నాటుసారాను, మూడు కేజీల కరక్కాయ స్వాధీనం చేసుకొని 2,500 లీటర్లు బెల్లంఊటను ధ్వంసం చేశారు. ముగ్గురు అనుమానితులను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అడిషనల్ ఎస్పీ పీ.మహేష్ సూచనలతో డీఎస్పీ టి.వెంకటేశులు పర్యవేక్షణలో ట్రైనీ డీఎస్పీ విద్యశ్రీ, పట్టణ సీఐ యు.శ్రీనివాసులు, సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసులు, వెదుళ్ళపల్లి, బాపట్ల, చందోలు ఎస్సైలు, సెబ్ ఎస్సైలు దాడులు నిర్వహించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ఎవరైన అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా, ఎవరైనా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని


నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

నిషేధిత సిగరెట్లు స్వాధీనం

గుంటూరు(తూర్పు), జనవరి18: బెంగళూరు నుంచి గుంటూరుకు అక్రమంగా తరలించి నిల్వచేసిన రూ.10.80 లక్షల విలువ చేసే నిషేదిత, హానికర సిగరెట్లను గురువారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పాతగుంటూరు పరిధిలో ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో నిర్వహించిన తనిఖీల్లో గోల్డ్‌స్టాన్ అనే కంపెనీకి చెందిన దాదాపు 22 వేల ప్యాకెట్ల నకిలీ సిగరెట్లను అధికారులు గుర్తించారు. విచారణలో తెనాలి, నరసరావుపేటకు చెందిన సాయిరాం, మహేశ్‌బాబు అనే ఇద్దరు వ్యక్తులు నిల్వ చేస్తున్నట్టు అధికారులు కనుగొన్నారు. నిందితులపై విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసు స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదు చేసారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికా రులు శ్రీహరిరావు, ఏఎస్ శ్రీనివాసులరెడ్డి, పాత గుంటూరు పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

- బాలికపై అత్యాచార ఘటనలో విద్యాశాఖ చర్యలు

పిడుగురాళ్ల, జనవరి 18: పిడుగురాళ్ల మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఉపాధ్యాయుడు షేక్ ఆదాంషఫీవుల్లాను జిల్లా విద్యాశాఖ అధికారి కే. శామ్యూల్ సస్పెండ్ చేసినట్లు పిడుగురాళ్ల ఎంఈవో ఒంగోలు రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూన్న షేక్ ఆదాంషఫీవుల్లా ఆ పాఠశాలకు వెళుతున్న పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈఘటనలో నిందితుడైన షేక్ ఆదాంషఫీవుల్లాను సస్పెండ్ చేస్తూ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఎంఈవో ఒంగోలు రాజు తెలిపారు.


ఆందోళన చేస్తున్న మహిళలు

రజకుల స్థలం వైసీపీ నేతల కబ్జా

- చర్యలు తీసుకోవాలని మహిళల ధర్నా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

నరసరావుపేట, జనవరి 18 : అధికారం అండతో వైసీపీ నేతలు అక్రమాలకు తెగబడుతున్నారు. ప్రభుత్వం స్థలాలతో ఆగక ఒక సామాజిక వర్గం వృత్తి కోసం కేటాయించిన స్థలాన్ని వదల లేదు. కోట్ల రూపాలయ విలువైన స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేశారు. మునిసిపల్, రెవిన్యూ అధికారులకు బాధితులు ఫిర్యాదు చేసినా స్పందించిన దాఖలాలు లేవు. కబ్జాదారులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో చర్యలు తీసుకోకుండా అధికారులు మిన్నకుంటున్నారు. బరంపేటలో ఇటీవల ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ నేతలు కబ్జా చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. బరంపేటలోని మరో స్థలాన్ని కబ్జా చేయడాన్ని మహిళలు అడ్డుకున్నారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని గురువారం ధర్నాచేశారు. బరంపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలో రజకుల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలంపై వైసీపీ నేతలు కన్నేశారు. ఆ స్థలాన్ని కబ్జా చేశారు. తమ స్థలం కబ్జా చేయడంపై రజక సామాజిక వర్గం మహిళలు అందోళన వక్తంచేశారు. స్థలం వద్దే అందోళనకు దిగారు. కబ్జాదారుల పేర్లను కూడా అధికారులకు అందజేశారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సామాజిక వర్గానికి కేటాయిం చిన స్థలాన్ని తమకు అప్పగించాలని విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకువెళ్లినా న్యాయం చేయలేదని, స్థలం కబ్జా చేసింది వైసీపీవారు కావడంతో పట్టించుకోవడంలేదన్నారు. స్థలాన్ని కబ్జాదారుల చెరనుంచి విడిపించాలని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనల చేస్తామని హెచ్చరించారు.

పుట్టిన తేదీ మార్పుకు ఆధార్ చెల్లదు

గుంటూరు సిటీ, జనవరి18: ఉద్యోగుల పుట్టిన తేదీని మార్చడానికి ఆధార్, ఈ-ఆధార్ పత్రం చెల్లుబాటు కాదని గుంటూరు రీజనల్ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ స్పష్టంచేశారు. గురువారం ఆయన ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు, యజమానులు, లబ్ధిదారులు ఈమార్పులు గమనించాలని ఇంద్రనీల్ ఘోష్ సూచించారు.

ఘాట్ రోడ్డు నిర్మాణంపై గొప్పలు

- ప్రజావేదికలో బట్టబయలు

వినుకొండటౌన్, జనవరి18: పట్టణంలోని కొండపై వేంచేసిన గంగా పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి సొంత నిధులతో పనిచేస్తున్నట్లు ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు గొప్పలు చెప్పుకొన్నారు. కానీ అవన్నీ ఒట్టి మాటలే అని ప్రజావేదికలో తేటతెల్లమైంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం 2022-23 సంవత్సరానికి 15వ జాతీయ ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమంపై ప్రజావేదికను నిర్వహించారు. కార్యక్రమంలో రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.1,66,84,670 చెల్లించినట్లు ఎస్ఆర్‌పీ బుజ్జి వెల్లడించారు. వర్క్ ఐడీ నెం.7759012080026తో రూ.40లక్షలు ఎస్టిమేట్స్ తయారు చేయగా రోడ్ల నిర్మాణానికి మొదటి విడతగా రూ.20,90,989, వర్క్ ఐడీ నెం.27లో రూ.26,64,741లు, వర్క్ ఐడీ నెం.28లో రూ.12,47,611, వర్క్‌ఐడీ నెం.29లో రూ.11,91,798, వర్క్ ఐడీ నెం.30లో రూ.11,67,246, 31లో రూ.4,30,313, ఐడీ నెం.32లో రూ.528913, 33లో రూ.587971, 34లో రూ.695571, 35లో రూ.620727, 36లో రూ.2,40,347, 41లో రూ.17,68,712, 42లో రూ.1354351, 43లో


కొండపై వేంచేసి ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయం

రూ.20,98,380.. ఈ మొత్తం 2021 నవంబరు 12వ తేదీన వెంకుపాలెం పంచాయతీ నుంచి వినుకొండ కొండపై నూతనంగా నిర్మిస్తున్న 2.5 కిలోమీటర్ల ఘాట్ రోడ్డుకు నిధులు చెల్లించినట్లు సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసింది. కాగా.. ఇప్పటివరకు తమ సొంత నిధులతో కొండ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని గొప్పలు చెప్పడం ఎంతవరకు సమంజసం అని పలువురు చర్చించుకుంటున్నారు.

వేటు తప్పదా..?

- ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఎన్నికల సంఘం సీరియస్
- తాజా చర్యలతో జిల్లా యంత్రాంగంలో ఉలికిపాటు
- ఫాం7ల దుర్వినియోగం విషయంలో ప్రత్యేక దృష్టి
- సహకరించిన సిబ్బంది.. ఇతరత్రా అంశాలపై ఈసీ ఆరా

బాపట్ల, జనవరి18(ఆంధ్రజ్యోతి): అధికారపార్టీ నేతలే కదా చెబుతోంది.. వారు చెప్పినట్లు చేసేద్దాం.. ఏమవుతుందిలే అనే ధీమాతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పాలకపార్టీకి కొమ్ముకాసిన యంత్రాంగంలో ప్రస్తుతం వణుకు మొదలైంది. తాజాగా ఓ ఐఏఎస్ అధికారిపై సస్పెన్షన్ కొరడాను ఈసీ ఝుళిపించడంతో ఇక్కడ కొమ్ముకాసిన సిబ్బంది, అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలపై పర్చూరు నియోజకవర్గంలో ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు ఈసీకి అందాయి. ఇంతేకాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అవకతవకలు బయటపడ్డాయి. అధికారపార్టీ నేతలు బీఎల్‌వోలతో సంభాషణ ఆడియోలు, వాట్సాప్ చాట్ స్క్రీన్‌చాట్‌లు వెలుగుచూశాయి. వీటన్నింటిపై జిల్లా అధికారులకు టీడీపీతో పాటు ఇతర విపక్షాలు ఫిర్యాదు చేస్తూనే వస్తున్నాయి. ఇక టీడీపీ రాష్ట్రస్థాయి నాయకులు సవరణ జాబితాలో వెలుగుచూసిన అవకతవకలను పలుమార్లు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ ఇచ్చిన ఫిర్యాదులతో పాటు జాబితాలో వెలుగుచూసిన అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టిసారించి విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో పాటు ఉద్దేశపూర్వకంగా తప్పిదాలకు పాల్పడింది ఎవరనే కోణాల్లో విచారణ చేస్తున్నట్లు సమాచారం. తుది ప్రచురణ ఈనెల 22న విడుదల కానుండడంతో ఈలోపుగానే కొంత మంది యంత్రాంగంపై ఈసీ వేటు వేయనున్నట్లు సమాచారం.

తొలి నుంచి హెచ్చరిస్తున్నా...

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలోని లోటుపాట్లను కేంద్ర ఎన్నికల సంఘం చాలా సీరియస్‌గా తీసుకుంటుందని, కనుక ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పూర్తి పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముగించాలని సంబంధింత సిబ్బందికి తొలినుంచి హెచ్చరికలు అందుతూనే ఉన్నాయి. పాలకపార్టీ నేతల నుంచి ఎంత ఒత్తిడి ఎదురైనా తట్టుకుని కొంత మంది నిబద్ధత పాటిస్తే, మరి కొంతమంది మాత్రం అత్యుత్సాహంగా అధికారపార్టీ నేతలు అడిగిందే తడవుగా వారు చెప్పినట్లు సవరణ ప్రక్రియను పూర్తి చేశారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం వారంతా ఈసీ ఏం చర్యలు తీసుకుంటుందనే ఆందోళనలో ఉన్నారు.

లెక్కలేనన్ని అవకతవకలు... ఫిర్యాదులు..

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి పెద్దసంఖ్యలో అవకతవకలు ఇటు పర్చూరుతో పాటు అటు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వెలుగుచూశాయి. గుంటూరులో కొత్తగా ఇన్‌చార్జిగా వచ్చిన మహిళా నేత ఒకరు తప్పుడు చిరునామాతో ఓటు హక్కు పొందిన బాగోతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అదే విధంగా యంత్రాంగంతో కీలకనేత ఒకరు సవరణ ప్రక్రియకు సంబంధించిన వాట్సాప్ చాట్ స్క్రీన్ షాట్ కూడా ఉమ్మడి గుంటూరు పరిధిలోనే బయటపడింది. ఓ ప్రజాప్రతినిధి ఏకంగా బీఎల్‌వోతో తమకు అనుకూలంగా లేని వారి ఓట్లు తొలగించాలంటూ హుకుం జారీ చేస్తున్న ఆడియా సందేశం కూడా ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే వెలుగుచూసింది.

ఇక పర్చూరులో అయితే నిత్యం..

బాపట్లజిల్లా పరిధిలోని పర్చూరు నియోజకవర్గంలో ఫాం7కు సంబంధించిన దుర్వినియోగం రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. ఇక్కడ ఫాం7లను గంపగుత్తగా పాలకపార్టీ నేతలు దరఖాస్తు చేయడంలో కొంతమంది రెవెన్యూ సిబ్బంది సహకారం కూడా లభించింది. దీంతో వారు ఇష్టారీతిన ఫాం7లు నమోదు చేసి మొత్తం ప్రక్రియనే తప్పుదారి పట్టించే దుస్సాహసానికి ఒడిగట్టారు.

తుది ప్రచురణకు ముందే చర్యలు..

ఓటర్ల జాబితా ఫైనల్ పబ్లికేషన్ ఈ నెల 22న జరగనుంది. దానికంటే ముందే ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు, పర్చూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఉదాసీనంగా ఉన్న ముగ్గురు రెవెన్యూ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడనుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఈసీకి అందిన ఫిర్యాదుల్లో ఈ ముగ్గురిపై సాక్ష్యాధారాలతో టీడీపీ అందించడంతో వారిపై చర్యలకు ఈసీ సిఫారసు చేసిందని రెండుమూడు రోజుల్లో వారిపై వేటు పడనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

అన్నింటిపై ఈసీ దృష్టి.

జాబితాలో అవకవతకలతో పాటు అందిన ఫిర్యాదులపై జిల్లా అధికారులు ఏం చర్యలు తీసుకున్నారు అనే దానిపై కూడా ఈసీ కసరత్తు చేస్తోంది. దానిలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి దాదాపు 20కు పైగా ఫిర్యాదులు జిల్లా అధికారులకు అందాయని వాటిపై చేసిన విచారణ ఏమిటి.. తీసుకున్న చర్యలేంటి అనే కోణంలో కూడా ఈసీ ఆరాతీసినట్లు తెలుస్తోంది.

కేసులపై కదలిక ఏంటి..?

పర్చూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలకు సంబంధించి ఇప్పటికే ముగ్గురు ఎస్సైలు, ఓ సీఐపై సస్పెన్షన్ వేటు పడిన సంగతి తెలిసిందే. వీరితో పాటు బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మంది సచివాలయ మహిళా పోలీసులకు మెమోలు కూడా గతంలోనే పోలీస్ శాఖ జారీచేసింది. ఇక ఫాం7 ల దుర్వినియోగం విషయంలో దాదాపు 48 మందిపై పోలీసులు కేసులు పెట్టగా ఇందులో 22 మందిపై పర్చూరు ఈఆర్‌వో ఫిర్యాదుతో పెట్టినవికాగా, మిగిలినవారిపై ఖాకీలే కేసులు పెట్టడం గమనార్హం. వీరిపై నమోదుచేసిన కేసుల విషయంలో పురోగతి ఏంటన్న ఆయా కోణాల్లో ఈసీ విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

వినుకొండ, జనవరి 18: పట్టణంలోని ఏనుగుపాలెం రైల్వేట్రాక్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. మృతుని శరీరంపై ఎరుపు రంగు టీషర్ట్, కోటు ధరించి పేరేచర్ల నుంచి వినుకొండకు టికెట్ కలిగి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గుర్తించినవారు నరసరావుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు.

కొమ్మమూరు కాలువలో మృతదేహం లభ్యం

తెనాలి రూరల్, జనవరి 18: మండలంలోని సంగం జాగర్లమూడి సంగమేశ్వర స్వామిఆలయం వద్ద కొమ్మమూరు కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని రైతులు గురువారం గుర్తించారు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. ప్యాంట్,షర్టు ధరించిన 50ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీనిపై కేసునమోదు చేసి మృతదేహాన్ని తెనాలి జీజీహెచ్ మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

78,137 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డుకు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) గురువారం రైతులు 1,03,408 టిక్కీలను విక్రయానికి తీసుకురాగా వాటిల్లో 90,720 అమ్మకాలు జరిగాయి. ఇంకాయార్డులో 51,101 మిర్చిటిక్కీలు నిల్వవున్నట్లు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మిర్చి వెరైటీల ధరలు ఇలా...

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	20000	334	17000	19500
నెంబరు. 5	14500	18000	నెంబరు. 5	–	–
273	10500	18000	273	–	–
341	9000	19500	341	–	–
4884	13000	16500	4884	–	–
సూపర్ 10	17200	17200	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	21000	తేజ	–	–
బ్యాడిగి	10000	18500	బ్యాడిగి	11000	11000
దేవనూరు డీలక్స్	10000	17000	దేవనూరు డీలక్స్	–	–
తెల్లకాయలు	5000	12500	తెల్లకాయలు	6000	10000



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

తెలుగుదేశంతోనే బీసీల ప్రగతి సాధ్యం

● నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 18 : బీసీల ప్రగతి తెలుగుదేశంతోనే సాధ్యమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా బాపట్ల మండల బీసీ నాయకులతో గురువారం టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి నరేంద్రవర్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో బీసీల నైపుణ్యం వెలికితీయటమే లక్ష్యంగా తీసుకొచ్చిన 30 పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. 70 వేలకు పైగా బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. 13 బీసీ భవనాలు, కమ్యూనిటీ హాలు నిర్మాణాలు నిలిపివేశారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 25 ఏళ్లుగా 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి 10 శాతం కోతతో రాజ్యాంగబద్ధ బీసీ పదవులు రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు నక్కల వీరరాఘవయ్య, మునేశ్వరరావు, రామానుజి, చెన్నుపాటి కిషోర్, సాంబశివరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

● కర్లపాలెం, జనవరి 18 : వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఒక్క అవకాశమని అడిగి పదవిలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి బీసీలకు తీరని అన్యాయం చేశాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. కర్లపాలెంలోని టీడీపీ కార్యాలయంలో కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల బీసీ నాయకుల ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్, జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు పర్చకుండా 55నెలలు నియంత పాలన సాగించి బీసీలపై దాడులు చేసి జగన్మోహన్‌రెడ్డి బీసీలను ఆర్థికంగా మానసికంగా దెబ్బతీశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ తాతా లీలావరప్రసాద్, నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, పమిడి రవి, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లోని పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్



అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 18 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రజలకు పిలుపునిచ్చారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ బీవీ నాథ్ ఆడిటోరియంలో గురువారం సామాజిక న్యాయ మహాశిల్పం ఏర్పాటు సందర్భంగా జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం పుస్తకంలాంటిదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమస్యలను ప్రశ్నించి పరిష్కారం లభించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వం అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, అధ్యాపకులు చుక్కా నాగభూషణం, అబ్రహాంలింకన్ పి.అశోక్, నూకతోటి బాబురావు, ఇనగలూరి మాల్యాద్రి, గుదే రాజారావు, డి.రాము పాల్గొన్నారు.

పేదలందరికి సొంత ఇంటి స్థలం

బాపట్ల, జనవరి 18: సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న పేదలందరికీ ఇంటి స్థలం, గృహ నిర్మాణాలకు ఆర్థిక చేయూతనందిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. నవరత్నాలు - పేదలందరికీ ఇల్లు లబ్ధిదారులకు వడ్డీ తిరిగి చెల్లించే కార్యక్రమాన్ని తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. బాపట్లలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్సీ పోతుల సునీత చేతుల మీదగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10,592 మంది లబ్ధిదారులకు రూ.1.42 కోట్లను వారి ఖాతాలకు జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ పీడీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాపట్లలో రక్తదాన శిబిరం

బాపట్ల, జనవరి 18: విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ ఆధ్వర్యంలో జిల్లాలోని మార్టూరు, రేపల్లె, బాపట్ల అంబేద్కర్ భవన్‌లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో 100 యూనిట్ల రక్తదానం చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, టీబీ అధికారి డాక్టర్ రమాదేవి, డాక్టర్ శేషకుమార్, మహ్మద్ సాధిక్, జానీబాషా, డాక్టర్ మహేష్, డాక్టర్ రాజుసిలువన్ పాల్గొన్నారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రేపల్లె బ్రాంచ్ వారు ది.13-09-2023న వేసిన ప్రకటనలో వాగుల లక్ష్మి ప్రాంతి గారి యాడ్‌లో పొరపాటున షెడ్యూల్‌లో 2 అయిటం ప్రకటించలేదు కావున ఈ క్రింది విధంగా చదువ కోరనైనది. షెడ్యూలు: టిట్ గ్రామం కొలాడ టిట్ గ్రామ డి.నెం. 318/3నుంచిలోనైయిండి టిట్ రేటు మెజయూ గల 2వ అయిటం దళంకోసికి హద్దులు తూర్పు : పైపవ అయిటం రాకలా స్థలం హద్దు అ.9లు, దక్షిణం : నాగుల రాము మోహనరావు గారి ఆస్తి హద్దు అ. 52లు, పడమర : పంచాయితీ బజారు హద్దు అ. 9లు, ఉత్తరం : నాగుల వైరాను గారి ఆస్తి హద్దు అ. 52లు, యీ హద్దుల మధ్య చ.అ. 468లు లేక చ.గ.52లు ఇందుకు సరియగు చ.మీ. 43.48లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలము పైరెండు అయిటమ్ల కొలాడ చ.అ. 2457.16లు లేక చ.గ. 273.02లు ఇందుకు సరియగు చ.మీ. 228.27లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలం మాత్రం.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914

ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందుకు నడుద్దాం

● సైకో జగన్ పాలనకు స్వస్తి పలకాలి
● టీడీపీ, జనసేన సంకీర్ణ పాలనకు కంకణబద్ధులు కావాలి
● ఎన్టీఆర్ వర్ధంతి సభలో మాజీ మంత్రి ఆనందబాబు



వేమూరులో ఎన్టీఆర్‌కు నివాళులర్పించి ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, జనవరి 18 : తెలుగుదేశం పార్టీ స్థాపించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు కృషి చేసిన నందమూరి తారక రామారావును స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని వేమూరులో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆనందబాబు ఎన్టీఆర్ విగ్రహానిక పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు బాపట్ల జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షత వహిం చారు. సభలో ఆనందబాబు మాట్లాడుతూ పేదవాడికి కూడు, గూడు, గుడ్డ నినాదంతో అధికారంలోకి వచ్చి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి శ్లాఘనీయమన్నారు. రాష్ట్రంలోనే దుష్టపాలన చూసి ఆవేదనతో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కంకణబద్ధులయ్యారని తెలుగుదేశం పార్టీతో కలిసి అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు దెబ్బలపూడి సుధాకర్, తెలుగు రైతు నాయకులు అమ్మిశెట్టి కిషోర్‌బాబు, సీనియర్ నేత గోగినేని కేశవరావు, రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ హనీఫ్, తెలుగు మహిళ నాయకులు దుర్గా, మన్నే లక్ష్మీ, నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త రాజేష్, చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 18 : సమ సమాజ స్థాపనే ధ్యేయంగా ఎన్టీఆర్ పరిపాలన సాగించారని ఆయన కలను నిజం చేయడమే కర్తవ్యమని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టీడీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. గురువారం కొల్లూరు బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటం వద్ద మాజీ మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనం తరం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్ర హం, మండల పరిధిలోని పోతార్లంకలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముసలిపాడులో ఏఎంసీ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, గుమ్మడి శివ, యలవర్తి కోటేశ్వరరావు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 18: వెల్లటూరులో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్యలు పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోటూరు పుణ్యశ్రీనివాసరావు, ఎంపీటీసీ వాకా వెంకటనారాయణ, బొజ్జా రవి, పోతార్లంక రాజేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వాకా శేషిబాబు, నాయకులు కనపర్తి సుందరరావు, యడ్ల జయశీలరావు, బి.మల్లికార్జునరావు, ఆదిన బసవపున్నయ్య తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఐలవరం, వెల్లటూరు, పెదపులివర్రు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు.

● అమృతలూరు, జనవరి 18 : మండలపరిధిలోని గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూచిపూడి, యలవర్రు, అమృతలూరు, మోపర్రు, మూల్పూరు, యడవూరు, ఇంటూరు, తురుమెళ్ళ, గోవాడ, ప్యాపర్రు, గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహా లకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కూచి పూడి యలమంచిలి జగన్మోహనరావు, తుమ్మల కిషోర్, మట్లపూడి జయపాల్, తుమ్మల భుజంగరావు, బసవపున్నయ్య, జగదీష్, క్రొత్తపల్లి రవీంద్రబాబు, నార్ల శ్రీను, మ్యాచ్యూస్ తదితరులు పాల్గొన్నారు.

● చుండూరు, జనవరి 18 : ఎన్టీఆర్‌తోనే తెలుగు జాతికి ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలుగురైతు మాజీ అధ్యక్షుడు వీఎస్‌కే ప్రసాద్ తెలిపారు. మండూరులో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. చుండూరులో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గూడేటి ఎల్లారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరెడ్డి, చిన వెంకటరెడ్డి, కోటిరెడ్డి, శివ బ్రహ్మారెడ్డిలు పాల్గొనగా, మండూరులో దేవిరెడ్డి నాగేశ్వరరావు, పిచ్చయ్య, కాశిం, అశోక్, దేవిరెడ్డి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, జనవరి 18: బాపట్ల మండలం చెరువు గ్రామ పంచాయతీలోని ఎన్టీఆర్ విగ్రహానికి గ్రామ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కంకటపాలెం, చెరువుజమ్ములపాలెం, అప్పికట్ల, జిల్లెళ్ళమూడి, గుడిపూడి, భర్తిపూడి, పూండ్ల, వెదుళ్ళపల్లి గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పార్టీనాయకులు నివాళులర్పించారు.

● బాపట్ల, జనవరి 18: తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నార ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని బాపట్ల పార్టీ కార్యాలయంలో గురువా రం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిం చి అనంతరం పార్టీశ్రేణులతో కలిసి పాతబస్టాండ్‌కు చేరుకొని అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి నరేంద్రవర్మ మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అని చెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు చిరస్మరణీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ,మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, నాయకులు సాంబశివరావు, దాసరి యోహాను, పరిశా రమేష్‌గౌడ్, గేరా చార్లెస్, ఉప్పాల కృష్ణగౌడ్, పరీద్‌మస్తాన్, పల్లం సరోజినీ, మందపాటి అంద్రేయ, కూచిపూడి ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

● ఆంధ్రుల ఆరాధ్యదైవం ఎన్టీఆర్ అని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలోని అప్పికట్లలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జీబీసీ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, బూత్ కన్వీనర్ అమర్‌నాథ్, బాబుజీ, సీతారామయ్య, సత్యం, ప్రమోద్, శ్రీధర్, రాంబాబు పాల్గొన్నారు.

● మండలంలోని చెరువుజమ్ములపాలెం ఎస్సీకాలనీలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీశ్రేణులంతా కలిసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కటికల సునీల్‌బాబు, వడ్డిముక్కల జ్యోతిరాజు, పాల్, స్వాములు, సురేష్, సుబ్బారావు, వెంకాయమ్మ, శేషు పాల్గొన్నారు.



పిట్టలవానిపాలెంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

● పిట్టలవానిపాలెం, జనవరి 18: పిట్టలవానిపాలెం టీడీపీ కార్యాలయం నందు గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ మండల అధ్యక్షులు ఎండీ అఫ్జల్, క్లస్టర్ ఇన్‌చార్జి కనుమూరి సాంబమూర్తిరాజు, సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, మోదుగుల శంకరరెడ్డి, బొలగాని నారాయణ, బేతాళ నరసరాజు తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పార్టీ నాయకులు

● రేపల్లె, జనవరి 18: తెలుగుజాతి ఆత్మ గౌరవం కోసం అహర్నిశలు పాటుపడ్డ కలియుగ పురుషుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు అన్నారు. ఉప్పూడిరోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని 4 మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి ప్రవేశించి పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నా రు. రైల్వేస్టేషన్ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 7వ వార్డులోని ఏకలవ్య కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి, కిసాన్‌నగర్‌లో చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రభుత్వవైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్ర మంలో ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్, రాష్ట్ర చేనేత విభాగం కార్యనిర్వహణ కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, గోగినేని పట్టాభిరామారావు, మే కా పూర్ణచంద్రరావు, బాషా, పంతాని సాయికుమార్, చెన్ను నాగమల్లేశ్వరరావు, తాతా ఏడుకొండలు, వీరవల్లి శివరామకృష్ణ, గోగినేని శ్రీను, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపట్నం పార్టీ కార్యాలయంలో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొమ్మిడి రామకృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జనవరి 18 : చెరుకుపల్లి పార్టీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా కనగాల, నడింపల్లి, గూడవల్లి, కావూరు గ్రామాల్లో ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, నాగుల పున్నారావు, ఎంఆర్‌కే మూర్తి, కందుల వెంకటేశ్వరరావు, పూషడపు కుమారస్వామి, దివి శ్రీనివాసరావు, బట్టు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పోతుందంటూ బెదిరింపులు

● భయంతో విధుల్లో చేరిన ఒకరిద్దరు అంగన్‌వాడీలు
● బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదంటున్న కార్యకర్తలు
● 38వ రోజున కొనసాగిన సమ్మె

కొల్లూరు, జనవరి 18: అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెను నిర్వీర్యం చేసేందుకు అధికార పార్టీ నాయకులు ఉద్యోగం పోతుందంటూ కార్యకర్తలను బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో భయాందోళనలకు గురై తమ ఉద్యోగం నిజంగానే పోతుందనే భయంతో సమ్మెను వీడి విధుల్లో చేరుతున్నారు. ఐసీడీఎస్ అధికారులు, అధికార పక్షం నేతలను ఆశ్రయించి ఎలాగైనా కొంత మంది కార్యకర్తలనైనా నయానో భయానో విధుల్లో చేర్పిస్తే మిగిలిన వారు సమ్మెను వీడి విధుల్లో చేరతారని చెప్పడంతో కొల్లూరు మండలంలో కొంత మంది సమ్మె వీడి వెంటనే విధుల్లో చేరకపోతే మీ ఉద్యోగాలు వదులుకోవాల్సిందేనని ఇప్పటికే మీ ఉద్యోగాలు తీసి వేసేందుకు కలెక్టర్ నుంచి నోటీసులు జారీ అవుతున్నాయంటూ, పైగా ఇంటర్మీడియట్ చదివిన వలంటీర్లను ఈ ఉద్యోగాలకు ఎంపిక చేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్లుగా బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ పరిణామాలు చూస్తున్న సమ్మెలో ఉన్న కార్యకర్తలు ముగ్గురు, నలుగురు భయపడి విధుల్లో చేరినంత మాత్రాన తమ న్యాయమైన కోర్కెలు సాధించుకోవడం లేదా గట్టి హామీ పొందకుండా సమ్మెను వీడే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. సమ్మెను ఎలాగోలా నిర్వీర్యం చేసేందుకు ఐసీడీఎస్ అధికారులు, అధికార పక్షం నాయకులు కుట్రపన్ని ఉద్యోగాలు పోతాయంటూ బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యలు మానుకుని వారు కూడా తమ న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలపాలని కోరుతున్నారు.

సమ్మె నిర్వీర్యానికి అధికార పార్టీ కుట్ర

అమృతలూరు, జనవరి 18: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె నిర్వీర్యం చేసేందుకు ఐసీడీఎస్ అధికారులు, అధికార పార్టీ నేతలు కుట్రకు తెరతీశారు. సమ్మెలో పాల్గొన్న అధికార పార్టీ నేతలకు చెందిన బంధువులు, కుటుంబసభ్యులను బతిమిలాడి, భయపెట్టి ఇద్దరు ముగ్గురిని, విధుల్లో చేర్పించినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 308 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా కేవలం గురువారంనకు 51మంది విధుల్లో చేరుతున్నట్లుగా వాట్సాప్‌లో సీడీపీవోకు సందేశాలు పంపారు. అధికార పార్టీ నేతలు ఎన్ని కుట్రలు, బెదిరింపులకు పాల్పడినా తాము అదరం బెదరం అంటూ గురువారం సైతం రెట్టించిన ఉత్సాహంతో సమ్మె కొనసాగించారు.



బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నోటీసులు చూపిస్తూ ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

బాపట్ల, జనవరి 18 : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట కార్యకర్తలు బైటాయించి అధికారులు జారీ చేసిన నోటీసులు చూపిస్తూ నిరసన తెలియజేశారు. న్యాయమైన తమ కోర్కెలు తీర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వెలగా శైలశ్రీ, గీత, సీతామహలక్ష్మీ, పద్మ, భారతి, పార్వతి, సిఐటియు నాయకులు సి.హెచ్ మజుందార్, జె.శామ్యూల్, శరత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై మొండి వైఖరి మానుకోవాలి : మణిలాల్

రేపల్లె, జనవరి 18: ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పండుగలప్పుడు కూడా రోడ్లమీద ఉండి ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీల వర్కర్ల హెల్పర్స్‌పై ప్రభుత్వం మొండివైఖరి అవలంభిస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. గురువారం స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద సమ్మె 38వరోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎన్ని కుట్రలు, కుతంత్రా లు చేసిన సమస్య పరిష్కారమయ్యేంత వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఝాన్సీ, నాయకులు కృష్ణకుమారి, మేరీమణి, నిర్మలా జ్యోతి, శివలక్ష్మీ,రజని పాల్గొన్నారు.

బాపట్లలో సామాజిక సమతా సంకల్పం మారథాన్



మున్సిపల్ హైస్కూల్ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో రవీందర్

బాపట్ల, జనవరి 18 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ పురస్కరించుకొని బాపట్లలో గురువారం సామాజిక సమ తా సంకల్పం మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ వద్ద ర్యాలీని ఆర్డీవో గంధం రవీందర్ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడ నుం చి పాతబస్టాండ్, గడియార స్తంభంసెంటర్ మీదగా అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకొని మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులు ప్రతిజ్ఞ పూనారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, పీఈటీ కత్తిశ్రీనివాసరావు, ఎంపీపీ చినపోతుల హరిబాబు, ఏఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.చార్వాక, శీలం రోజన్‌బాబు, తహసీల్దార్ సుధారాణి, పౌరసరఫరాలశాఖ మేనేజర్ శ్రీలక్ష్మీ, మున్సిపల్ ఏఈ ఉమామహేశ్వరరావు, విద్యుత్ ఏఈ పెరుగు శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరంలో మహిళను కాపాడిన పోలీసులు

బాపట్లరూరల్, జనవరి 18 : సూర్యలంక సముద్రతీరంలో గురువారం ఓ మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించగా పోలీసులు ఆమెను రక్షించి ఒడ్డుకు చేర్చారు. వివరాల్లోకి వెళితే.. బాపట్ల పట్టణం ఉప్పరపాలేనికి చెందిన ఓ మహిళ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సూర్యలంక సముద్రతీరంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విధుల్లో ఉన్న సూర్యలంక ఔట్‌పోస్ట్, మెరైన్ పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి అప్రమత్తంగా వ్యవహరించి ఆమె ప్రాణాలను కాపాడారు. మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

దగ్గుమళ్ళ సౌజన్యంతో రక్తదాన శిబిరం

బాపట్ల, జనవరి 18 : ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ నాయకులు, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు సౌజన్యంతో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బాపట్లలోని ఎంఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎన్టీఆర్ కళాపీఠం వ్యవస్థాపకులు సీఎస్ఎస్‌ఆర్ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ తెలుగువారి అభిమాన ప్రజానాయకునిగా ఎన్టీఆర్ కారణజన్ముడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు, ప్రముఖ కవి డాక్టర్ భీరం సుందరరావు, బీసీనాయకులు ఉప్పాల మురళీ, షేక్.కరీముల్లా, కంచర్ల సతీష్, శ్రీమన్నారాయణ, యువత పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన భావపురి రచయితల సంఘం

బాపట్ల, జనవరి 18 : ఐదున్నర దశాబ్దాలకు పైగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశేషమైన సేవలందిస్తూ భావపురి రచయితల సంఘం చరిత్ర సృష్టించిందని అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మనశ్యామ్ సుందర్, నందిరాజు విజయ్‌కుమార్ తెలియజేశారు. సంఘ సర్వసభ్య సమావేశం గురువారం బాపట్లలో జరిగింది. సమావేశానికి శ్యామ్‌సుందర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ 1968లో ప్రముఖ రచయిత పోలాప్రగడ సత్యనారాయణమూర్తి ఆలోచనకు ప్రతిరూపంగా ప్రముఖ కవయిత్రి డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ స్వగృహంలో స్థాపించిన ఈ సంస్థ ఆంధ్ర రాష్ట్రంలో వేలాది సాహిత్య కార్యక్రమాలు నిర్వహించిన ఘనత సాధించిందని తెలిపారు. డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు, డాక్టర్ కేఎస్ ఆచార్య, దర్భా బాబురావు తదితరులు ఈసంస్థ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. వారు సేవలను గౌరవించేందుకు ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో షేక్ బాబావలి, పోలానం వీరాంజనేయులు, డాక్టర్ మేకల రాజు, ఆక్సీ, డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

దళితులకు రాజ్యాధికారం రావాలి

● తమిళనాడు రాష్ట్రం చేయూరు ఎమ్మెల్యే పి.బాబు

బాపట్ల, జనవరి 18: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దళితులకు రాజ్యాధికారం రావాలని తమిళనాడు రాష్ట్రం చేయూరు నియోజకవర్గ వీసీకే పార్టీ ఎమ్మెల్యే పి.బాబు తెలిపారు. బాపట్లలో గురువారం రాష్ట్రస్థాయి బూత్ కమిటీ ఇన్‌చార్జిల అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు వీసీకే పార్టీ రాష్ట్రాధ్యక్షుడు ఎన్‌జే విద్యాసాగర్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వీసీకే పార్టీ 50 అసెంబ్లీలతో పాటు కొన్ని పార్లమెంట్ నియోజకవర్గాలను ఎంపిక చేసుకుందన్నారు. బీజేపీ మతతత్వంకు వ్యతిరేకంగా ఇండియా కూటమిలో కలిసి పని చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇండియా కూటమి భాగస్వామ్యంతో చర్చిస్తామన్నారు. రాష్ట్రాధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షపార్టీలు బీజేపీని నిలదీసే పరిస్థితిలో లేరని విమర్శించారు. సమావేశంలో తెలంగాణ ఇన్‌చార్జి బాలసింగం, చంద్రన్, రాష్ట్రమహిళా అధ్యక్షురాలు కె.ప్రమీలా, సుందరం, బాపట్ల జిల్లా అధ్యక్షులు రేగులగడ్డ చంద్రశేఖర్, సలగల చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమగ్ర కులగణన సర్వే

కొల్లూరు, జనవరి 18 : సమగ్ర కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమవుతుందని ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు గురువారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు మండల గ్రామాల్లో కులగణన సర్వే జరుగుతుందని, మూడు బృందాలుగా కులగణన సర్వే చేస్తున్నట్లుగా ఎంపీడీవో చెప్పారు. ఒక బృందానికి తాను పరిశీలన అధికారిగా, మరో రెండు బృందాలకు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ రవిబాబులు పరిశీలన అధికారులుగా వ్యవహరిస్తారన్నారు.

మృతునికి కుటుంబానికి చేయూత

భట్టిప్రోలు, జనవరి 18: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఐలవరం గ్రామానికి చెందిన దివి మోహనకృష్ణ కుటుంబానికి పద్మశాలీయ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీవా) అండగా నిలిచింది. పీవా అసోసియేషన్ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన రూ.12 వేలు నగదును భట్టిప్రోలు, ఐలవరం బ్రాంచి ఆర్గనైజర్లు కటకం సాంబశివరావు, కాగితపు యానాదిరావు గురువారం మృతుడి భార్యకు అందించారు. పీవా అధ్యక్షుడు స్వర్ణం పుల్లారావు, స్థానిక ఆర్గనైజర్లకు మృతుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో భద్రావతి భావనారుషి కల్యాణోత్సవం

భట్టిప్రోలు, జనవరి 18 : శ్రీభద్రావతీ సమేత శ్రీభావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాలను పద్మశాలీయ సంఘాల ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అద్దేపల్లి తిరువీధుల శ్రీసీతారామ మందిరం ప్రాంగణంలో స్వామివార్ల కల్యాణాన్ని తిరువీధుల నాగమల్లేశ్వరరావు-నాగజ్యోతి దంపతులచే తిరువీధుల కాళిదాసు సిద్ధాంతి శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత గ్రామ పురవీధుల్లో స్వామికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని కోనేటిపురం భద్రావతీ సమేత భావనారుషి దేవస్థానంలో స్వామికి కల్యాణాన్ని జరిపించారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి : ఎంపీటీసీ

కర్లపాలెం, జనవరి 18 : మండలంలోని ప్రతి గ్రామాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసుకోవాలని నల్లమోతువారిపాలెం ఎంపిటిసి తాండ్ర సాంబశివరావు అన్నారు. కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో జీపీడీపీ కార్యక్రమంలో సాంబశివరావు పాల్గొని పలుసూచనలు చేశారు. ఎంపిపి యారం వనజ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్డీ ఏలీషాబాబు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామయ్యకు సీపీఎం నాయకుల నివాళి

కొల్లూరు, జనవరి 18 : సీపీఎం సభ్యుడు తిరుమలశెట్టి వెంకట్రామయ్యకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. వెంకట్రామయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా గురువారం మండల పరిధిలోని గాజుల్లంకలో అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి టి.సురేష్, మాజీ ఎంపీపీ అమృతలూరి కృపానందం, పార్టీ నాయకులు సనకా అగ్గిరామయ్య, అరవ వీరభద్రుడు, సనకా కుమారస్వామి, అరవ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెదుళ్ళపల్లిలో నాటుసారా స్వాధీనం

బాపట్ల, జనవరి 18 : మండలంలోని వెదుళ్ళపల్లిలో నాటుసారా విక్రయిస్తున్న వారిపై సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. అంగడి శివకృష్ణ నాటుసారా విక్రయిస్తున్నట్లు గుర్తించి అతని వద్ద ఉన్న 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సెబ్ సీఐ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్ఐ ప్రభుదాసుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా స్టూవర్టుపురం 4వ గ్యాంగ్‌లో కర్రెద్దుల బాలరాజుపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


చీరాల: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కొండయ్య


మార్టూరు: ఏలూరి క్యాంపు కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

యుగపురుషుడు.. ఎన్టీఆర్

» పలుచోట్ల నివాళులు » భారీగా అన్నదానం, సేవాకార్యక్రమాలు » టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

చీరాల, జనవరి 18: పార్టీ స్థాపించిన 9 నెలల వ్యవధిలోని ముఖ్యమంత్రిగా ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు యుగపురుషుడని, సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఆయన చిరస్మరణీయునిగా ప్రజల మదిలో ఉంటారని ఆ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్యా అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డేటా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో కొండయ్య మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జరిగిన పాలనకు ఎన్టీఆర్ ఆద్యులని అన్నారు. సీఎం జగన్ చెప్పే మాటలకు, చేతలకు పొంతన ఉండదన్నారు. తల్లి, చెల్లిని పక్కన పెట్టిన ఆ పెద్దమనిషి రాష్ట్రాన్ని ఏం ఉద్ధరిస్తారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాక్షస పాలనకు చరమగీతం పాడి, తిరిగి రామరాజ్యం రావాలంటే టీడీపీ గెలుపు, చంద్రబాబు ముఖ్యమంత్రి కావటం అనివార్యమన్నారు. సభ అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ పొగడదండ రవికుమార్, గజవల్లి శ్రీనివాసరావు, గంజి పురుషోత్తమ్, నాశిక వీరభద్రయ్య, వంకా హరికృష్ణ, శ్రీనివాసతేజ, ఉసురుపాటి సురేష్, సయ్యద్‌బాబు, కారంపూడి పద్మిని, కర్పూరపు సుబ్బలక్ష్మి, బుర్ర కవిత, యర్రా శివనాగమల్లేశ్వరి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గూడూరి శివరామప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల మండలం ఈపురుపాలెం, రామకృష్ణాపురం, చీరాలనగర్ తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేటపాలెం మండలం రావూరిపేటలోని ఎన్టీఆర్ విగ్రహానికి జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఆపార్టీ చీరాల నియోజకవర్గ బాధ్యుడు ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు), టీడీపీ నాయకులు నాశిక వీరభద్రయ్య, కర్ణ శ్రీనివాసరావు, తదితరులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరులో.. మార్టూరు, జనవరి 18: ఎన్టీఆర్ 28వ వర్ధంతి వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు శివరాత్రి శ్రీను, శానంపూడి చిరంజీవి, షేక్ ఫరూక్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, మండల కాంప్లెక్స్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మార్టూరులోని పార్టీ కార్యాలయం వద్ద తెలుగు మహిళలు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు, రావినేని శ్రీనివాసరావు, జెట్టి శివ, కామినేని జనార్దన్, షేక్ ఫరూక్, జంపని సాంబశివరావు, మువ్వా సాంబయ్య, తేలప్రోలు సాంబశివరావు, ఉప్పుటూరి రమాదేవి, పున్నారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మార్టూరులో బొడ్డురాయి సెంటరు వద్ద కమ్మ శివ నాగేశ్వరరావు, చల్లగుండ్ల సుబ్బారావు తదితరులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు, తెలుగు మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులకు అన్న సంతర్పణ చేశారు. బొబ్బేపల్లి, రాజుగారిపాలెం, ద్రోణాదుల, ఇసుకదర్శి, రాజుపాలెం, నాగరాజుపల్లి, తదితర గ్రామాలలో పార్టీ అభిమానులు ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. వలపర్ల గ్రామంలో సెంటరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కంభంపాటి హనుమంతరావు, జంజనం సుబ్బారావు, వెలగా రామాంజనేయులు, షేక్ బషీర్, సయ్యద్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా డేగరమూడి గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు.

యద్దనపూడి మండలంలో యద్దనపూడి, చింతపల్లిపాడు, గన్నవరం, పూనూరు, మున్నంగి వారిపాలెం, అనంతవరం, పోలూరు తదితర గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల కూడలిల వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో కనపర్తి నాగేశ్వరరావు, నల్లపనేని రంగయ్య చౌదరి, బోయపాటి సాంబయ్య, రావినేని సీతయ్య, గుదే తారక రామారావు, కొరటాల వంశీ, కోయ సతీష్, పూనూరు వాసు తదితరులు పాల్గొన్నారు.


పర్చూరు: కారంచేడులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు


మేదరమెట్ల: రావినూతలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

ఎన్టీఆర్‌పై వెల్లువెత్తిన అభిమానం

పర్చూరు, జనవరి 18: ఎన్టీఆర్ 28వ వర్ధంతిని గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అడుసుమల్లి, నాగులపాలెం, చెరుకూరు, బోడవాడ, వీరన్నపాలెం, పెద్దివారిపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణ, కోడూరి శేషబ్రహ్మాచారి, దూళ్ళిపాల్లి వెంకటస్వామి, చిట్టినేని రామకృష్ణ, మానం హరిబాబు, కొల్లా శివరాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు(పర్చూరు): స్వర్గీయ నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి వేడుకలు కారంచేడు మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కాల్వసెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీస్థాయిలో అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుములశెట్టి శ్రీహరి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్యచౌదరి, కసిమ్, రావి శాసయ్య, రావి వీరయ్యచౌదరి, పాతూరి ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, కారంచేడులోని తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్వర్యంలో కాల్వసెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యార్లగడ్డ నాగేశ్వరరావు, జాగర్లమూడి ప్రహ్లాదరావు, మందలపు సుబ్బారావు, చాగంటి లక్ష్మీనారాయణ, చాగంటి కోటేశ్వరరావు, దగ్గుబాటి చౌదరి, నల్లగొర్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. కుంకలమర్రు గ్రామంలో పార్టీ నాయకులు కొల్లా సుబ్బారాయుడు, టి.బంగారుబాబు, రాఘవయ్య, రవి, శివరాం, యోహాన్, ప్రకాశం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇంకొల్లులో.. ఇంకొల్లు, జనవరి 18: మండలంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహిచారు. గంగవరం, నక్కలపాలెం, ఇడుపులపాడు గ్రామాలలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంకొల్లులోని మండల పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం గ్రామంలో ర్యాలీగా నాగులచెరువు కట్టవద్ద ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పాలేరు రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు వలేరు మార్క్స్, వీరగంధం అంజనేయులు, చెరుకూరి రమేష్‌బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, హనుమయ్య, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో.. చినగంజాం: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు మాట్లాడుతూ తెలుగుజాతి అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

అద్దంకి, జనవరి 18: ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో సంక్షేమ పథకాలకు ఆద్యుడు నందమూరి తారకరామారావు అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక కాకానిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో పేద మహిళా కళాకారిణిని సత్కరించి నూతన వస్త్రాలు అందజేశారు. అన్నమనేని వెంకటరావు మాట్లాడుతూ చలనచిత్ర రంగంలో ఎన్టీఆర్ రారాజుగా వెలుగొందారన్నారు. కార్యక్రమంలో నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, తెలుగుయువత అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, జిల్లా టీడీపీ లీ గల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, గోరంట్ల లక్ష్మణదాసు, కాకాని అశోక్, కుందారపు రామారావు, భోజనపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి కార్య క్రమాలు నిర్వహించారు. చక్రాయపాలెంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గోగులమూడి రాజశేఖర్, నరేంద్ర, సుబ్బారావు, సత్యం, కోటయ్య, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

అలాగే, అద్దంకి మండలంలోని పలు గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం రాత్రి ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చినకొత్తపల్లి, శ్రీనివాసనగర్, తిమ్మాయపాలెంలో ఎన్టీఆర్ చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిమ్మాయపాలెంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. టీడీపీ నేతలు మానం మురళీమోహన్‌దాస్, బండారు రాఘవ, గణపతి, నూతి ప్రసాద్, అడుసుమల్లి శ్రీనివాసరావు, పరిటాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పుట్టావారిపాలెం అడ్డరోడ్డు, కామేపల్లి, వెల్లలచెరువు, ఏల్చూరు, కొమ్మాలపాడు, మామిళ్ళపల్లి, కుందుర్రు, పరిటాలవారిపాలెం, మక్కెనవారిపాలెం, సజ్జాపురం, కొప్పరం, బండివారిపాలెం, పత్తేపురం, మిన్నెకల్లు, తంగేడుమల్లి, చవిటిపాలెం, గురిజేపల్లి, పాతమాగులూరు, సంతమాగులూరు గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

బల్లికురవలో.. బల్లికురవ, జనవరి18: మండలంలోని పలు గ్రామాలలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, ఉప్పమాగులూరు, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, గొర్రెపాడు, గంగపాలెం, కొప్పెరపాలెం తదితర గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ నేతలు కొండేటి ఇజ్రాయిల్, మలినేని గోవిందరావు, అమరనేని కాశీవిశ్వనాధం, పరుసు ప్రసాద్, చింతల రామారావు, పత్తిపాటి వెంకటరావు, ఏల్చూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో.. పంగులూరు: ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. జాగర్లమూడివారిపాలెం, పంగులూరు, కొండమంజులూరు, చందలూరు తదితర గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రావూరి రమేష్‌చౌదరి బాబు, జాగర్లమూడి వెంకట్రావు, శ్రీకాంత్, జాగర్లమూడి పూర్ణచంద్రరావు, తెలగతోటి రాధ, తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్లలో.. మేదరమెట్ల: ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గురువారం మేదరమెట్లలో ఎన్టీఆర్ దంపతుల చిత్రపటానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్నాటి పూర్ణచంద్రరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బొల్లేపల్లి సుబ్బారావు, శేషయ్య తదితరులు కూడా నివాళులర్పించారు. దాదాపు 4 వేలకు మందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని రావినూతలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కారుసాల నాగేశ్వరరావు(బాబు) , మోపర్తి లక్ష్మీనారాయణ, కారుసాల గురుబాబు, కారుసాల సుబ్బయ్య, అనుబ్రోలు కస్తూరి, తదితరులు పాల్గొన్నారు. పమిడిపాడు శివారు కనగాలవారిపాలెంలో మండల పార్టీ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.


అన్నంబొట్లవారిపాలెంలో పోటీలో తలపడుతున్న ఎడ్లు

హోరాహోరీగా సాగుతున్న ఎడ్ల బల ప్రదర్శన

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 18: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన 36వ జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. స్థానిక గోరంట్ల రత్తయ్య చౌదరిక మెమోరియల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన పోలురాధ ఎడ్ల బలప్రదర్శనలో వివిధ ప్రాంతాల నుండి 22 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావటంతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఫ్లడ్‌లైట్‌ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

చినగంజాం, జనవరి 18: రొయ్యల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అవనిగడ్డ రాములు(68) గ్రామ సమీపంలోని వాగులో రొయ్యలు పట్టుకునేందుకు గురువారం ఉదయం వెళ్లాడు. రొయ్యల వేటచేసే సమయంలో రాములు వాగులో పడిపోయాడు. వాగులో వేట చేస్తున్న గ్రామానికి చెందిన మత్స్యకారులు గమనించి రాములును ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతదేహాన్ని వీఆర్వో కొమ్ము మోహనరావు, గ్రామ మత్స్యశాఖ సహాయకురాలు డి.ప్రతిభ పరిశీలించారు. వేట సమయంలో గుండెపోటుకు గురై మృతి చెంది ఉండవచ్చునని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కుటుంబసభ్యులు నిరాకరించారు.

సీఎం సభకు ఆర్టీసీ బస్సులు

» ప్రయాణికులకు తప్పని తిప్పలు

అద్దంకి, జనవరి 18: విజయవాడలో శుక్రవారం జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా సీఎం జగన్మోహనరెడ్డి హాజరయ్యే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఈక్రమంలో అద్దంకి డిపో నుంచి 25 ఆర్టీసీ బస్సులు ఏర్పాటుచేశారు. డిపోలో 40 బస్సులు ఉండగా, అందులో 25 పల్లె వెలుగు బస్సులను గురువారం సాయంత్రం నుంచే రద్దు చేశారు. బాపట్ల, చీరాల తదితర ప్రాంతాల నుంచి ప్రజలను తరలించేందుకు ఆయా గ్రామాలకు ఈ బస్సులను పంపినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. దీంతో అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాల బస్ సర్వీసులు రద్దు అయ్యాయి. అద్దె బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే ఆయా రూట్లలో నడిచాయి. బస్సులు రద్దు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు ముందస్తుగా ప్రకటించకపోవటంతో వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి అద్దంకి వచ్చిన ప్రయాణికులు తిరిగి వెళ్లేందుకు నానాఅవస్థలు పడ్డారు. గత్యంతరం లేక ఆటోలు, ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించారు. శుక్రవారం కూడా అత్యధిక రూట్లలో బస్సులు నడిచే అవకాశం లేకపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు తప్పడంలేదు.


అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

వేటపాలెం(చీరాల), జనవరి 18: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సమిష్టిగా కృషి చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ మహాలక్ష్మి అమ్మవారి చెట్టు సెంటర్లో టీడీపీ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను, అరాచక పాలనతీరును ఎండగట్టారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు.

కార్యక్రమంలో నాయకులు బొగ్గుల పార్థసారధి, నిమ్మల పిచ్చయ్య, నాశిక వీరభద్రయ్య, యర్రా శివనాగమల్లేశ్వరి, పోలయ్య, వెంగళభరత్, కోటేశ్వరరావు, సుబ్బారావు, లాల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములుకు నివాళులర్పించిన కృష్ణచైతన్య

అద్దంకి, జనవరి 18: పట్టణంలోని కాకానిపాలెంలో సందిరెడ్డి శ్రీరాములు(85) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతదేహం వద్ద శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీరాములుకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ తదితరులు నివాళులు అర్పించారు.

కనుల పండుగగా రథోత్సవం

చీరాల, జనవరి 18: పేరాలలో వేంచేసియున్న శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి రథోత్సవం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. భక్తుల జయ జయ ధ్వానాల నడుమ స్వామి రథోత్సవం సాగింది.

యంపరాల సచివాలయం తనిఖీ

అద్దంకిటౌన్, జనవరి 18: మండలంలోని యంపరాల గ్రామ సచివాలయాన్ని ఇన్‌చార్జ్ డీపీవో రాంబాబు గురువారం తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రేడ్ 5 అధికారులు లేకపోవడాన్ని ప్రశ్నించారు. తడి, పొడి చెత్తకు సంబంధించిన బుట్టలు గ్రామంలో పంచకుండా సచివాలయంలో ఉండడాన్ని పంచాయతీ సెక్రటరీని ప్రశ్నించారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

చీరాలటౌన్, జనవరి 18: చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ ప్రసాదరావు పేర్కొన్నారు. ఓవర్గాన్ని అవహేళన చేస్తూ దూషణకు పాల్పడిన ఇద్దరిని ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చీరాల మండలం గవినివారిపాలెంకు చెందిన మిండా వెంకటరావు, గవిని అయ్యప్పను బుధవారం ఉదయం ఆరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై జనార్దన్ పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

» 38వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

చినగంజాం, జనవరి 18: ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలంటూ అంగన్‌వాడీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆందోళన నిర్వహించారు. గత 38 రోజులుగా న్యాయమైన కోర్కెల సాధన కోసం చేస్తున్న పోరాటాన్ని కొనసాగిస్తూ ధైర్యంగా ముందుకు వెళ్ళాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు భయపడొద్దని, చివరికి విజయం మీదేనన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు, ఆయాలు మోకాళ్ళపై కూర్చొని దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల నాయకులు ఎ.హైమావతి, పి.జయలక్ష్మి, కె.రంగనాయకమ్మ, కె.యానాదమ్మ పాల్గొన్నారు.

ఐకమత్యంగా సాగుదాం..

చీరాల, జనవరి 18: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా సాగుదామని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గంగయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశ ధోరణిని విడనాడే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.వసంతరావు, ఎన్.బాబూరావు, ప్రమీల, సుజీవన, సులోచన తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు టీడీపీ, జనసేన నాయకులు మద్దతు ప్రకటించారు. గురువారం మండల కాంప్లెక్స్ వద్ద అంగన్‌వాడీల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్, జాష్టి సాంబశివరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, తగెళ్ల అంజనేయులు, షేక్ రజాక్, షేక్ ఫరూక్, ఉప్పలపాటి అచ్చిరాజు, పెంట్యాల శ్రీను, తొండెపు ఆదినారాయణ, జనసేన నాయకులు రామిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


చినగంజాం: మోకాళ్ళపై కూర్చొని దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు

బల్లికురవ: తమ న్యాయపరమైన కోర్కెలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని 64 కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకుండా ఎస్మా చట్టంతో బెదిరింపులకు గురిచేస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సునంద, శ్రీదేవి, అనురాధ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్, జనవరి 18: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 38వ రోజుకు చేరుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతి రెడ్డి, జి.శారద, మనోలత, తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

22 మంది సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

చీరాల, జనవరి 18: సెయింట్‌ఆన్స్ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లొమా 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ వాలియో ఫ్రిక్షన్ మెటీరియల్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు చెప్పారు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎన్.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.16 వేలు స్టైఫండ్, ఉచిత భోజన, వసతి, రవాణా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.విజయభాస్కరరెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు

చీరాల, జనవరి 18: రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా అంతర్జాతీయంగా ఉద్యోగ అవకాశాలకు అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335, 85559 01198 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

అభివృద్ధిపై ముందస్తు ప్రణాళిక అవసరం

చినగంజాం, జనవరి 18: గ్రామాల్లో అభివృద్ధిపై ముందుస్తు ప్రణాళికలు అవసరమని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలోని సమావేశపు హాల్‌లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీవిధానం 2024-2025పై గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను అమలు పరుచుటద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చునని ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నారు. గ్రామ పంచాయతీల్లో ఆర్థిక వనరులను ఏవిధంగా వినియోగించుకోవాలి, నిధుల ప్రాధాన్యత తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమంలో అధికారులు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, ఏపీఎం కె.అంజిబాబు, ఏపీవో లక్ష్మీదేవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీలు

మార్టూరు, జనవరి 18: మార్టూరులోని విజయలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల స్థాయి నూతన కమిటీల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడుగుంట లక్ష్మీనరసయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాట్లాడుతూ మందా కృష్ణమాదిగ ఆదేశాలకు అనుగుణంగా మండల స్థాయిలో నూతన కమిటీలు ఎంపిక కోసం సమావేశం ఏర్పాటుచేసినట్టు చెప్పారు. బొంతా దాస్ మాదిగ మాట్లాడుతూ నూతన కమిటీలు ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో వంగేవరపు రమేష్, జంధ్రాజుపల్లి సుబ్బారావు, దుడ్డు వందనం, ఎస్.ఆదాం, డి.నాగేశ్వరరావు, శేఖరబాబు, సర్దార్ పాపారాయుడు, మాదుగుల కిషోర్, అమర్తలూరి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

అడుసుమల్లి(పర్చూరు), జనవరి 18: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. అనంతరం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ స్వీట్స్ బాక్స్, నూతన సంవత్సర క్యాలెండర్‌తోపాటు, పథకాల బ్రోచర్‌ను గృహాలకు అందిస్తూ వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, చిట్టినేని రామకృష్ణ, మానం హరిబాబు, కారుమంచి కృష్ణ, అడ్డగడ్డ వేణుబాబు, నాయుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.